

341 చెక్ డ్యాంలు..!

వాగుల్లో.. వంకల్లో వృథాగా పోతున్న వర్షపు నీటికి అడ్డుకట్ట వేయాలి. ఆ నీటిని పొలాలకు మళ్లించాలి. పంటలను కాపాడి, భూగర్భ జలాలు పెంచాలనే ప్రధాన లక్ష్యంగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చెక్ డ్యాంల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. నాబార్డు నిధులతో చేపట్టే నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జిల్లాలో ఫేజ్-1 కింద 341 చెక్‌డ్యాం నిర్మాణాల రూ.62.93 కోట్ల నిధులు ఇవ్వాలని జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ ద్వారకానాథ్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఫేజ్-2 కింద చేపట్టబోయే చెక్‌డ్యాం నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారీలో ఇంజనీర్లు నిమగ్నమయ్యారు. నాబార్డు నిధులు చిన్ననీటిపారుదల శాఖ (ఎంఐ) ఇంజనీర్ల పర్యవేక్షణలో ఈ చెక్‌డ్యాంలు నిర్మించేలా ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. నిధులొస్తే తెలుగు తమ్ముళ్లకు పండుగే.

- రూ.62.93 కోట్లతో నాబార్డు ఫేజ్-1 కింద జలవనరుల శాఖ ప్రతిపాదనలు
- అత్యధికంగా పత్తికొండ నియోజకవర్గంలో 179 చెక్‌డ్యాంలు
- ఆదోని నుంచి ఒక్క ప్రతిపాదన కూడా లేదు
- ఫేజ్-2 కింద ప్రతిపాదనలు తయారీలో ఇంజనీర్లు

కర్నూలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):

అత్యధికంగా పత్తికొండలో 179 చెక్‌డ్యాంలు:

జిల్లాలో 25 మండలాలు ఉంటే ఫేజ్-1 కింద 19 మండలాల్లో మాత్రమే చెక్ డ్యాం నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించారు. అత్యధికంగా పత్తికొండ నియోజకవర్గంలో 179 చెక్‌డ్యాంలకు రూ.33.06 కోట్లు అవసరం ఉందని అంచనా వేశారు. అందులోనూ అత్యధికంగా కృష్ణగిరి మండలంలో 97, వెల్దుర్తి మండలంలో 51 చెక్‌డ్యాంలు ఉన్నాయి. నీరు-చెట్టు పథకం కింద చెక్‌డ్యాంలు నిర్మించకుండానే నిర్మించినట్లు బోగస్ బిల్లులు సృష్టించి కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో భారీగా నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నాబార్డు నిధులతో నిర్మించే చెక్‌డ్యాంల ప్రతిపాదనల్లోనూ ఆ మండలాలకే పెద్దపీట వేయడం కొసమెరుపు. ఆదోని నియోజకవర్గంలో ఒక్క చెక్‌డ్యాంకు కూడా ప్రతిపాదన పంపలేదు.

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎమ్మిగనూరు, నందవరం, కోడుమూరు నియోజకవర్గంలో గూడూరు, సి. బెళగల్, పాణ్యం నియోజకవర్గంలో కల్లూరు మండలాల్లో కూడా ఒక్క చెక్‌డ్యాంకు కూడా ఫేజ్-1లో స్థానం లభించలేదు. అయితే.. ఆయా మండలాల్లో ఎంఐ విభాగం ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉండడం, ఒక ప్రతిపాదన తయారు చేయాలంటే రూ.2-5 వేల వరకు ఖర్చు అవుతుండడంతో ప్రతిపాదనలు తయారు చేసేందుకు పక్క మండలాల ఇంజనీర్లు ఆసక్తి చూపడం లేదని తెలుస్తుంది.



వెల్దుర్తి మండలంలో నిర్మించిన చెక్‌డ్యాం

ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకొని ఖాళీగా ఉన్న ఎంఐ ఏఈఈ పోస్టులు భర్తీ చేయించాలని పలువురు కోరుతున్నారు. అయితే.. రెండు మూడు నియోజకవర్గాల్లో టీడీపీలోనూ, కూటమిలోనూ వర్గవిభేదాలు తీవ్రంగా ఉండడంతో ఆ నియోజకవర్గాల్లో పని చేసేందుకు ఏఈఈ, డీఈఈలు ఆసక్తి చూపడం లేదని తెలుస్తున్నది.

నాబార్డు నిధులతో చెక్‌డ్యాంల ప్రతిపాదనలు, అంచనా (సుమారుగా రూ.కోట్లలో)

నియోజకవర్గం	చెక్‌డ్యాంలు	అంచనా
ఆలూరు	54	9.88
ఎమ్మిగనూరు	12	2.24
కోడుమూరు	23	4.25
మంత్రాలయం	57	10.55
పత్తికొండ	179	33.06
పాణ్యం	12	2.21
డోన్	4	0.74
మొత్తం	341	62.93

నాబార్డు కింద చెక్ డ్యాంల నిర్మాణం

ప్రభుత్వం ఆదేశాల మేరకు నాబార్డు నిధులతో చేపట్టే చెక్‌డ్యాంల నిర్మాణాలకు ఫేజ్-1 కింద 341 చెక్‌డ్యాంల నిర్మాణాల కోసం రూ.62.93 కోట్లతో ప్రతిపాదన పంపించాం. మిగిలిన మండలాలు ఫేజ్-2 కింద పంపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. చెక్ డ్యాంలు నిర్మాణం వల్ల భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల ద్వారా సాగు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

- ద్వారకనాథ్‌రెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్

మొక్కజొన్న ధర పతనం

- కొనుగోలు కేంద్రాల కోసం రైతన్నల ఎదురు చూపు
- వాము పొట్టు ధర క్వింటం రూ.9,500

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొక్కజొన్న పంట ప్రస్తుత రబీలో దాదాపు 30వేల ఎకరాల్లో సాగైంది. ఈసారి మొక్కజొన్నలకు మంచి ధర లభిస్తుందని రైతులు ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి మొక్కజొన్న పంటలను సాగు చేశారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్న ధర నానాటికి పతనం అవుతుండటంతో ఆ పంట సాగు చేసిన రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో గురువారం క్వింటం మొక్కజొన్నకు గరిష్ఠ, మధ్యస్థ ధరలు కేవలం రూ.2,173 మాత్రమే రైతులకు దక్కింది. కనిష్ఠ ధర రూ.1,439 మాత్రమే అందింది. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నలకు క్వింటానికి మద్దతు ధరను రూ.2,250గా ప్రకటించింది. గతంలో ధర తగ్గినప్పుడు మొక్కజొన్న కొనేందుకు మార్క్‌ఫెడ్ సంస్థ పెద్దఎత్తున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో రైతులు కష్టనష్టాల నుంచి బయట పడ్డారు. మళ్లీ ఇప్పుడు మొక్కజొన్న రైతులను ఆదుకునేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులకు రైతు సంఘాల ప్రతినిధులను మొర పెట్టుకుంటున్నారు. ఉల్లిగడ్డలకు కూడా మార్కెట్ యార్డులో నామమాత్రంగానే ధర లభిస్తోంది. గరిష్ఠ ధర రూ.1,589, మధ్యస్థ ధర రూ.1,339, కనిష్ఠ ధర రూ.719లు మాత్రమే దక్కింది. ఎండుమిర్చికి రకాలను బట్టి గరిష్ఠ ధర రూ.11,111 నుంచి రూ.9,069 వరకు మాత్రమే ధర దక్కింది. వాముకు గరిష్ఠ ధర రూ.18,862, మధ్యస్థ ధర రూ.12,462, కనిష్ఠ ధర రూ.1200 దక్కింది. వాము పొట్టుకు ఊహించని ధర లభిస్తుండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వాము పొట్టుకు గరిష్ఠంగా క్వింటానికి రూ.9,500 దక్కింది. మధ్యస్థ ధర రూ.1,200, కనిష్ఠ ధర రూ.710 పలికింది. కందులకు గరిష్ఠ ధర రూ.7,089, మధ్యస్థ ధర రూ.7,049, కనిష్ఠ ధర రూ.3,799 అందింది. కొర్రలకు గరిష్ఠ, మధ్యస్థ ధరలు రూ.2,479, కనిష్ఠ ధర రూ.1503, మినుములకు గరిష్ఠం రూ.7,349, మధ్యస్థ ధర రూ.7,243, కనిష్ఠ ధర రూ.6,500 దక్కింది.



వాము పొట్టు

జడివాన



7

'పది' మూల్యాంకనం ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని సబ్జెక్టుల మూల్యాంకనం గురువారం ఉదయం తాండ్రపాడులోని క్రేడో పాఠశాలలో ప్రారంభమైంది. కర్నూలు జిల్లాకు 1,93,747 జవాబుపత్రాలు వచ్చాయి. గురువారం సాంఘికశాస్త్రం, ఒకేషనల్ మినహా 11,081 పేపర్ల మూల్యాంకనం జరిగింది. మూల్యాంకనం 5.7 శాతంగా నమోదైంది. కేంద్రంలో ఎటువంటి అసౌకర్యా లు లేకుండా చర్యలు చేపట్టినట్లు డీఈఓ శామ్యూల్‌పాల్ తెలిపారు. మొదటి రోజు చీఫ్ ఎగ్జామినర్లు 89 మంది, 537 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 145 మంది స్పెషల్ అసిస్టెంట్లు హాజరయ్యారు. పదో తరగతి ఓపెన్ పరీక్షలకు సంబంధించి 16,200 పేపర్లు రాగా, 1,275 పేపర్ల మూల్యాంకనం జరిగింది. వీటిని 15 మంది చీఫ్ ఎగ్జామినర్లును, 82 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతి

- రూ.83 లక్షల మేర అవినీతి జరిగినట్లు నిర్ధారణ
- రికవరీకి ఉన్నతాధికారుల ఆదేశం

ఓర్వకల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు ఉపాధి కార్యాలయం ఎదురుగా గురువారం ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన 18వ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. డ్వామా పీడీ వెంకట రమణయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు హాజరయ్యారు. 1.4.2023 నుంచి 31.3.2024 సంబంధించిన ఉపాధి పనులు, పంచాయతీరాజ్ పనులు సామాజిక బృందం 15 రోజులపాటు ఆయా గ్రామాల్లో జరిగిన పనులను పర్యవేక్షించారు. ఓర్వకల్లులో బహిరంగ సభ ఏర్పాటు చేసి టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లతో పనులపై చర్చ నిర్వహించారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో భూముల కొలతల్లో తేడాలు రావడం, పనులు లేకపోవడం, ఉపాధి పనులకు వెళ్లకపోయినా మస్టర్లలో పేర్లు ఉండ టం దీనిపై గ్రామాల్లో సామాజిక తనిఖీల్లో బట్టబయలైంది. అధికా రులు మాత్రం ప్రజా వేదికను తూతూమంత్రంగా నిర్వహించారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 1379 పనులు చేశారని, అందుకు రూ.16,27,85,634 నిధులు ఖర్చు పెట్టామన్నారు. ఎస్ఆర్‌పీ తనిఖీలో రూ.83 లక్షలు అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృం దం నిర్ధారించారు. అయితే గ్రామ గ్రామాన ఫీల్డ్ అసిస్టెంట్లతో ముఖా ముఖి నిర్వహించడం పనుల్లో జరిగిన అవినీతిపై అధికారులు మండిపడ్డారు. అయితే చివరకు ఇంత అవినీతి జరిగినా కొంత మాత్ర మే రీకవరి చేయాలని అధికారులు ఆదేశాలు ఇవ్వడంపై ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ తనిఖీలో రూ.1.73 వేల రికవరీ, రూ.95వేలు పెనాల్టీ వేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ మధుసూదన్, సీడీసీఎల్ఆర్‌సీ అధికా రి సుజాత, ఏపీడీ పద్మావతి, ఎంపీడీవో శ్రీనివాసులు, జడ్పీటీసీ సభ్యులు రంగనాథగౌడు, ఎస్ఆర్‌పీ విజయకుమార్, ఏపీవో కుమార సాయినాథ్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసినట్లు డీఈవో శామ్యూల్‌పాల్ గురువారం తెలిపారు. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టీఐఎస్) ఆధారంగా అభ్యంతరాలను సరి చేసి ఈ జాబితాను డీఈవో వెబ్‌సైట్‌లో ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు ఈ జాబితాను సరి చేసుకోవాలని డీఈవో వివరించారు.

నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక



కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ శుక్రవారం కర్నూలుకు రానున్నట్లు సీపీఐ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. దిన్నెదేవర పాడులో ఏపీఈఆర్‌సీ భవనంలో విద్యుత్ నియంత్రణ బోర్డు అధ్వర్యంలో జరిగే ప్రజాభిప్రాయ సేకరణను సమావేశాన్ని వ్యతిరేకిస్తూ జరిగే నిరసన కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొంటారన్నారు.

వ్యాపార నైపుణ్యాలు అలవర్చుకోవాలి

డీఈవో శామ్యూల్ పాల్



మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు వ్యాపార నైపుణ్యాలను పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ, ఎస్ఈఆర్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంటర్‌ప్రెన్యూనర్ మైండ్ సెట్ జిల్లా స్థాయి సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఎంటర్‌ప్రెన్యునర్ మైండ్ సెట్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం తరగతి గదిలో విద్యార్థులు వీడియోలను ప్రదర్శించిన ప్రాజెక్టులు ఎంటర్‌ప్రెన్యూనర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సంబంధించి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులలో ఉత్తమ ప్రాజెక్టును ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు దండబోయిన పార్వతి, నాగలక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ గోపాలకృష్ణ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరుకే రైతుబజార్..!

- గత ప్రభుత్వంలో రైతులను తరిమి.. దళారుల తిష్ట
- కాసులు కురిపిస్తున్న షాపులు
- దళారుల పెత్తనం తట్టుకోలేక పోలీస్‌స్టేషన్లకు వెళుతున్న అధికారులు
- షాపులు, హోటళ్లు కేటాయింపుల్లో చేతివాటం

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు పండించే రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు తక్కువ ధరకే అందించేందుకు ఏర్పాటు చేసిన రైతుబజార్లు క్రమంగా అధికారుల జేబులు నింపే ఆదాయ వనరులుగా మారాయి. ఈ రైతుబజార్లలో మచ్చుకైనా రైతులు కనిపించడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇక్కడ ఎలక్ట్రానిక్ కాటాలనే వినియోగించాలి. అవి కూడా రైతు బజార్లలో కనిపించడం లేదు. బోర్డుపై ఒక ధర రాసి, మరో ధరకు వ్యాపారులు అమ్ముతున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారుల నిర్వహణలో రైతుబజార్లు నడుస్తున్నా అడుగడుగునా వీటిలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. మార్కెట్ యార్డుల్లో హోల్‌సేల్ ధరలకు వ్యాపారులు కూరగాయలు కొనుగోలు చేసి ఆటోల్లో వీటిని రైతుబజార్లకు తరలించి రెట్టింపు ధరలు అమ్ముకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని రైతుబజార్లలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను తక్కువ ధరకే అందించడానికి, కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి రైతుబజార్లు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వచ్చిన జగనన్న పాలనలో ఆ లక్ష్యం నీరుగారిపోయింది. కర్నూలు సీ.క్యాంపు రైతుబజార్‌లో కాస్తో.. కూస్తో ఒకరిద్దరు రైతులు కనిపిస్తున్నా అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట రైతు బజార్లలో రైతులు లేరు. రైతుబజార్లలో వ్యాపారులే తిష్టవేశారు. రైతులకు గుర్తింపు కార్డుల జారీలో గుర్తింపు అవకతవకలు చోటు చేసుకున్నాయి. జిల్లాకేంద్రంలోని సి.క్యాంప్ రైతుబజార్‌లో దళారులే ప్రతిరోజూ తెల్లవారుజామున కర్నూలు మార్కెట్‌యార్డులో హోల్‌సేల్ ధరకు కూరగాయలు కొని వాటిని రైతుబజార్లకు తీసుకెళ్లి రెట్టింపు ధరకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఈ రైతుబజార్లలో ఒక్క కాటా కూడా సరిగ్గా లేదని, బోర్డుపై నమోదు చేస్తున్న ధరలకు కూరగాయలు విక్రయించడం లేదనే విమర్శలు ఉన్నాయి. షాపుల, హోటళ్ల కేటాయింపులో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు, ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన కూరగాయలను అందించేందుకని ప్రభుత్వం జిల్లాలో రూ. 2 కోట్లు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన రైతుబజార్లు ప్రస్తుతం అధికారులకు జేబులు నింపే మార్గాలుగా మారాయి. కర్నూలు నగరంలోని సి.క్యాంప్, కొత్తపేట, అమీన్‌అబ్బాస్‌నగర్, నంద్యాల, ఆదోని రైతుబజార్లలో తనిఖీలు జరిగాయి. వీరి తనిఖీల్లో అడుగడుగునా అక్రమాలు వెలుగు చూశాయి.



కొత్తపేట రైతుబజారు

మిగతా 6వ పేజీలో

వైభవంగా వీరభద్రస్వామి రథోత్సవం

ఆస్పరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైరుప్పల గ్రామంలోని భద్రకాళి వీరభద్ర స్వామి రథోత్సవం వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవంలో భాగంగా జరిగిన వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భద్రకాళి వీరభద్ర స్వామి ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి ఊరేగించారు. కైరుప్పల గ్రామ ప్రజలతో పాటు సమీప గ్రామాలైన పుప్పాల దొడ్డి, కారుమంచి, కలపరి, చెన్నంపలి, వెంగళాయిదొడ్డి, కోటకొండ, ములుగుందం, బిల్లేకల్లు అలాగే సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రథోత్సవ వేడుకలను తిలకించారు. కార్యక్రమంలో వరప్రసాద్ బాబు, శేషి రెడ్డి, సర్పంచ్ తిమ్మక్క, రామకృష్ణ, బీటెక్ వీరభద్ర, పూజారి మహేష్, బసవరాజు, శేషాద్రి నాయుడు, మదు, రాఘవరెడ్డి పాల్గొన్నారు.



కైరుప్పల వీధుల్లో సాగుతున్న వీరభద్ర స్వామి రథోత్సవం

వైభవం.. జ్యోతి ఉత్సవం

500కు పైగా జ్యోతులతో చౌడేశ్వరీ మాతకు నివేదన ● నందవరానికి లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు


అమ్మవారి జ్యోతులతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

బనగానపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శక్తి క్షేత్రమైననందవరం చౌడేశ్వరిదేవి ఆలయం జ్యోతులతో హోరెత్తింది. ఉగాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన జ్యోతి మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. లక్షలాది మంది భక్తులు జ్యోతి ఉత్సవాలకు హాజరయ్యారు. 500కు పైగా జ్యోతులను అమ్మవారికి నివేదనగా సమర్పించారు. అమ్మవారి జ్యోతి మహోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలనుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ జి.కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భాస్కరయ్య ఆచారి సంప్రదాయంగా అమ్మవారికి దిష్టిచుక్క పెట్టిన అనంతరం జ్యోతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాత్రి 2 గంటలకు గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద నుంచి జ్యోతి మహోత్సవం ప్రారంభమైంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తొగటవీర క్షత్రియులు అమ్మవారి జ్యోతులను తలపై పెట్టుకుని నృత్యం చేస్తూ, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ ఎదుట ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో నడిచి గర్భాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి జ్యోతులను అమ్మవారికి సమర్పించారు. అర్ధరాత్రి 2 గంటలకు ప్రారంభమైన జ్యోతుల ఊరేగింపు శనివారం ఉదయం 11 గంటల వరకు సాగింది. కాగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి సతీమణి బీసీ ఇందిరమ్మ జ్యోతులను మోసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.


నందవరం శ్రీచౌడేశ్వరీమాత జ్యోతి ఉత్సవాల సందర్భంగా గండా దీపం మోస్తున్న రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ


జ్యోతులతో అగ్నిగుండం దాటుతున్న భక్తులు

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవాన్ని వీక్షించేందుకు సుదూర ప్రాంతాల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయశాఖ అధికారులు, గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి అర్ధరాత్రి నుంచి నిరంతరాయంగా భక్తులు చౌడేశ్వరిదేవి దర్శించుకునే అవకాశం కల్పించారు. ఆలయ నిత్యాన్నదాన సత్రంతో పాటు పలు నిత్యాన్న సత్రాల్లో భక్తులకు అన్నదానం చేశారు. మహాసిమెంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో భక్తులు నిమ్మరసం పంపిణీ చేశారు. వైద్యఆరోగ్యశాఖ, మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు మంజునాథరెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు దుగ్గిరెడ్డి, వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు. ఈవోలు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రుడు, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం నందవరం గ్రామంలో నిర్వహించిన చౌడేశ్వరిదేవి రథోత్సవం వైభవంగా సాగింది.


జ్యోతి ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులు

పేరుకే రైతు బజార్..!

5వ పేజీతరువాయి

కొత్తపేట, అమీన్‌అబ్బాస్‌నగర్ రైతుబజార్లలో బోగస్ వివరాలతో వ్యాపారులే రైతులుగా అవతారమెత్తినట్లు ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల్లో వెలుగు చూడడం గమనార్హం.

అంతా బోగస్సే.. తప్పుడు వివరాలతో రైతు కార్డులు

నగరంలోని సి. క్యాంప్ రైతుబజార్‌లో 1433 మంది రైతులు 26 మంది పొదుపు మహిళలు కూరగాయలు విక్రయిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొత్తపేట రైతుబజార్‌లో 26 మంది అమీన్ అబ్బాస్‌నగర్‌లో 22 మంది రైతులు కూరగాయలు విక్రయిస్తున్నారని, నంద్యాలలో 24 మంది, ఆదోనిలో 20 మంది రైతులు కూరగాయలు విక్రయిస్తున్నారని ఈ రైతుబజార్లలో ప్రతి రోజూ 1000 క్వింటాళ్ల కూరగాయలను 16 వేల మంది రైతులు కొనుగోలు చేస్తున్నారని కమిషనర్‌కు ప్రతిరోజూ నివేదికలు పంపిస్తున్నారు. ఇటీవల విజిలెన్స్ అధికారుల తనిఖీలో పై రైతు బజార్లలో పది నుంచి 20 మంది రైతులు మాత్రమే గుర్తింపుకార్డులు తెచ్చుకున్నారు. మిగిలిన వారంతా మర్చిపోయి వచ్చామని తప్పించుకున్నారు. వారికి అధికారులు వంతపాడారు. పొదుపులక్ష్మి మహిళలు కొన్ని సంవత్సరాలైనా గుర్తింపు కార్డులు రెన్యువల్ చేయించుకోలేదు. కొన్ని రైతుబజార్లలో రాజకీయనాయకులు, ఉన్నతాధికారుల సిఫారసు చేయడం వల్లనే ఇతరులకు కూరగాయలు అమ్ముకునేందుకు అవకాశం ఇచ్చినట్లు ఎస్టేట్ అధికారులు చెబుతున్నారు. అయితే.. వీరి నుంచి పొదుపు లక్ష్మి గ్రూపు మహిళలతో పాటే రోజు అద్దెను వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వివరాలను రికార్డులో మాత్రం నమోదు చేయకపోవడంతో ప్రతిరోజు వేల రూపాయలు అధికారులు, సిబ్బంది జేబుల్లోకి వెళ్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

షాపులు, హోటళ్ల కేటాయింపులో గోల్‌మాల్

జిల్లాలో రైతుబజార్లు ఏడీఎం పర్యవేక్షణలో నిర్వహించబడుతున్నాయి. సి. క్యాంప్ రైతుబజార్‌తో పాటు, అమీన్ అబ్బాస్‌నగర్, కొత్తపేట, నంద్యాల, ఆదోని రైతుబజార్లలో షాపులు, హోటళ్ల కేటాయింపులో అక్రమాలుచోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వాటిలో వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు విజిలెన్స్ అధికారులు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. షాపులు అద్దెకు తీసుకున్న వారు వ్యాపారం చేయకుండా ఇతరులతో రెట్టింపు అద్దె తీసుకొని వారికి అప్పగించినట్లు ఫిర్యాదులు అందాయి. కొన్ని రైతు బజార్లలో షాపులను అక్కడ పని చేస్తున్న సిబ్బందే బినామీ పేర్లతో దక్కించుకుని ఇతరులకు అధిక అద్దెకు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీ. క్యాంపు రైతుబజారులో కొన్ని షాపులను అద్దెకిచ్చేందుకు రూ.50వేల నుంచి రూ.1లక్ష దాకా వసూలు చేసినట్లు వెలువెత్తుతున్నాయి. ఈ


అధికారులకు కాసులు కురిపిస్తున్న సీ.క్యాంపు రైతుబజారు షాపులు

రైతుబజారులో నడవడానికి కూడా స్థలం లేకున్నా అధికారులు తమ జేబులు నింపుకునేందుకే టీషాపులు, ఔషధాల విక్రయం కోసం మరి కొన్ని షాపులు ఏర్పాటు చేశారు.

దళారుల పెత్తనం తట్టుకోలేక పోలీస్ స్టేషన్లకు పరుగులు

కర్నూలు నగరంలోని సీ.క్యాంపు రైతుబజారులో క్రమక్రమంగా తిష్ట వేసిన దళారులు తమ మాటే అమలు జరగాలని హుకుం జారీ చేస్తున్నారు. వీరి హెచ్చరికలు, ఆధిపత్యాన్ని తట్టుకోలేక ఇటీవల ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్, సెక్యూరిటీ గార్డులు ఉన్నతాధికారుల అనుమతులు కోరారు. దళారులను ఏరివేసేందుకు జాబితాను సిద్ధం చేస్తున్నారు. దళారుల పెత్తనాన్ని అరికడతామని టీడీపీ నాయకులు అధికారులకు భరోసా ఇచ్చారు.

అక్రమాలకు పాల్పడే వారికే అందలం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న కొంత మంది ఎస్టేట్ అధికారులు, సెక్యూరిటీ సిబ్బందిపై మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తపేట రైతుబజారులో పని చేస్తున్న ఎస్టేట్ అధికారిపై ఫిర్యాదులు వచ్చాయి. ఆ అధికారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు వేరే రైతుబజార్లకు డిప్యుటేషన్‌పై పంపి అంతటితో తమ పని అయిపోయినట్లు చేతులు దులుపేసుకున్నారు. తిరుపతిలో పని చేస్తున్న ఒక ఎస్టేట్ అధికారిపై ఆరోపణలు రాగా, ఆయన్ను ఆదోని రైతుబజారుకు బదిలీ చేశారు. ఇక్కడ కూడా ఆ అధికారిపై ఫిర్యాదులు వెలువెత్తడంతో కర్నూలు రైతుబజారుకు త్వరలోనే బదిలీ చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎస్టేట్ అధికారులు మార్కెటింగ్ శాఖలో పని చేస్తున్న ఒక ఉన్నతాధికారి కనుసన్నల్లోనే పని చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు ఆ రైతుబజార్ల వైపు కన్నెత్తి కూడా చూడకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు ఎస్టేట్ అధికారులను బయటపడేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



చర్యలు చేపడుతాం

రైతుబజార్ల నిర్వహణలో ఫిర్యాదులు అందుతున్న మాట వాస్తవమే. వాటిని ప్రక్షాళన చేస్తాం. అక్రమాలు జరిగినట్లు రుజువైతే ఎస్టేట్ అధికారులను ఇతర రైతుబజార్లకు డిప్యుటేషన్లపై పంపిస్తాము. జాయింట్ కలెక్టర్ అనుమతి తీసుకుని పొదుపు లక్ష్మి గ్రూపు మహిళలకు కూరగాయల అమ్మకం కోసం అనుమతిని ఇస్తున్నాం.

- నారాయణమూర్తి, ఏడీఎం, కర్నూలు

మరో మూడు రోజులు పిడుగులు పడే అవకాశం

● గంటకు 6 కిలోమీటర్ల వేగంతో గాలులు

● ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక



నంద్యాల ఎడ్యుకేషన్/ఆదోని, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4, 5, 6 తేదీల్లో భారీస్థాయిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరుతో అనేక ప్రాంతాల్లో 5.0 మిల్లీమీటర్ల నుంచి 18.0 మి.మీ., వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు అలాగే గరిష్ఠ ఉష్ణోగ్రత 36.5 డిగ్రీల నుంచి 38.0 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశం ఉందన్నారు. నైరుతి దిశ నుంచి ఆగ్నేయం దిశ మీదుగా గంటకు 6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. గాలిలో తేమశాతం 65 నుంచి 68శాతం, మధ్యాహ్నం 16 నుంచి 35శాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. బేతంచర్ల, డోన్, కొలిమిగుండ్ల, అవుకు, ప్యాపిలి, వెలుగోడు ప్రాంతాల్లో ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులు, గొర్రెలు, మేకల విషయంలో జాగ్రత్త వహించాలి. ఉద్యానపంటలు గాలుల తాకిడికి పడిపోకుండా ఊతం ఇవ్వాలి. వరికోతలు ఉన్న రైతులు వాతావరణానికి అనుగుణంగా జాగ్రత్త పడాలి. ప్రధానంగా మామిడి రైతులు కూడా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

- మురళీకృష్ణ, వ్యవసాయాధికారి, నంద్యాల

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

1. ఉరుములు, మెరుపులు సంభవించినప్పుడు చెట్ల కింద, చెట్ల సమీపంలో టవర్లు, చెరువుల దగ్గర ఉండకూడదు.
2. పొలాల్లో పనిచేసే రైతులు బహిరంగప్రదేశాల్లో పనిచేసేవారు, పశువుల కాపరులు, గొర్రెల కాపరులు సురక్షితమైన భవనాలలోకి వెళ్లాలి.
3. బహిరంగ ప్రదేశాలలో ఉన్న షెడ్లు, ఇంటిపైన ఇతర చిన్న నిర్మాణాలలో ఉండరాదు.
4. బహిరంగ ప్రదేశాలలో ఉన్నట్లయితే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. లేకుంటే రబ్బరు చెప్పులను ధరించి చెవులను మూసుకుని మోకాలిపై కూర్చోవాలి.
5. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర పరికరాలు, చార్జింగ్‌లో ఉన్న ఫోన్లు, మొబైల్స్ వినియోగించకూడదు.
6. ఇంట్లో ఉన్నట్లయితే కిటికీలు, తలుపులు మూసి వేయాలి.
7. మోటార్‌సైకిళ్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, ట్రాన్స్‌పార్మర్‌కు వేలాడుతున్న విద్యుత్ తీగలకు, ఇతర ఇనుప వస్తువులకు దూరంగా ఉండాలి.

రేపు క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఎస్‌ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 5వ తేదీ అండర్-23 సీనియర్ క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి కె.దేవేంద్రగౌడు గురువారం తెలిపారు. 1.9.2002 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. వివరాలకు 99592 51047ను సంప్రదించాలన్నారు.

వృద్ధులకు ఆరోగ్య బీమా

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక పరిస్థితులతో నిమిత్తం లేకుండా 70 సంవత్సరాలు దాటిన వయో వృద్ధు లకు ఆరోగ్య బీమాను కల్పించిందని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి వయో వందన పథకంలో రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా వర్తిస్తుందన్నారు. ఈ పథకాన్ని వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపు నిచ్చారు.

6న అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగే అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే అండర్-19 కర్నూలు జట్టు ఎంపిక 6న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవేందర్‌గౌడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు డీఎస్‌ఏ స్టేడియంలోని కర్నూలు క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. 1-9-2006 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు.

సెలెక్షన్ లిస్టు విడుదల : 9 నుంచి అభ్యర్థులకు కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాలల్లో ఉద్యోగాలకు సంబంధించిన 11 కేటగిరీల అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్టు, సెలక్షన్ లిస్టులను వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కె. చిట్టి నరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్ 2023 నవంబరు 20న విడుదల చేశామని చెప్పారు. మెరిట్ లిస్టులను కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్లు kurnool.ap.gov.in, nandyal.ap.gov.in, kurnoolmedicalcollege.ac.inలలో అప్‌లోడు చేసినట్లు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 సెట్లు సర్టిఫికెట్లతో ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఉదయం 10.30 గటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. హాజరు కాని అభ్యర్థుల ఎంపికను రద్దు చేయనున్నట్లు తెలిపారు.

వీఆర్‌లో ఉన్న ఎస్ఐలకు పోస్టింగ్

నంద్యాల క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో వీఆర్‌లో ఉన్న పలువురు ఎస్ఐలకు పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా గురువారం తెలిపారు. నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్ఎస్ఐ ఎం.రామస్వామిని నంద్యాల త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు, నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్ఐ ఎ.అంజాద్‌అలీని డోన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు, నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్ఐ బి.శ్రీనివాసరావును డీసీఆర్‌బీ నంద్యాలకు పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్ఐ పి.శ్రీనివాసులును పీసీఆర్ నంద్యాలకు, నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్ఐ కేసీ తిరుపాలును బేతంచెర్ల అర్బన్ పోలీస్ స్టేషన్‌కు పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్ఐ ఎం.గోపాల్‌ను కొలిమిగుండ్ల అర్బన్ పోలీసు స్టేషన్‌కు, నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్ఐ ఎస్ఎం జగన్నాథనాయక్‌ను డోన్ అర్బన్ పోలీసు స్టేషన్‌కు, నంద్యాల వీఆర్‌లో ఉన్న ఆర్పీ ఎస్ఐ ఎన్.మహమ్మద్ రఫిని నంద్యాల తాలుకా పోలీస్‌స్టేషన్‌కు పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. వీరంతా ఆయా పోలీస్ స్టేషన్లలో తక్షణం రిపోర్టు చేయాలని తెలిపారు.

మహానందిలో ప్రముఖుల పూజలు


మహానందిలో ఐపీఎస్ అధికారి జీఎస్ రావు

మహానంది, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో గురువారం పలువురు ప్రముఖులు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వీరికి ఆలయం, ముఖ మంటపం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. తెలంగాణకు చెందిన ఐపీఎస్ అధికారి జీఎస్‌రావుతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన న్యాయాధికారి పట్టాభిరామ్ దంపతులు ప్రధాన ఆలయాల్లోని మహానందీశ్వర స్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు అభిషేకార్చనలు నిర్వహించారు. పూజల అనంతరం వీరిని ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో ఆలయ వేదపండితుడు శాంతారామ్‌భట్ ఆశీర్వదించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శాలువాతో సన్మానించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

మద్దతు ధరకు జొన్నలు కొంటాం

● దళారులను నమ్మి మోసపోవద్దు ● జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య విజ్ఞప్తి

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ పౌర సరఫరాల సంస్థ నుంచి విడుదలైన ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాలో రైతులు పండించిన జొన్నలు హైబ్రిడ్ రకాలను (సీ-43-మహేంద్ర)లను ప్రభుత్వ కనీస మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని గురువారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జొన్నలకు కనీసం మద్దతు ధర క్వింటానికి రూ.3,379 చొప్పున ప్రకటించినట్లు తెలిపారు. రైతులు నాణ్యత ప్రమాణాలను అనుసరించి రైతు సేవా కేంద్రాల వద్ద సివిల్ సప్లయ్ సంస్థకు విక్రయించాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

ముస్లింలపై మోదీ చిన్నచూపు

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ

నంద్యాల రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ముస్లింలను చిన్నచూపు చూడటమే కాకుండా, వారి మనోభావాలు దెబ్బతీయడమే ప్రధాని నరేంద్రమోదీ అజెండాగా పెట్టుకున్నారని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జెంగటి లక్ష్మీనరసింహ యాదవ్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడతూ ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను హరించడానికే కేంద్రం వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. మైనార్టీల ప్రయోజనాలను దెబ్బతీసే బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. నంద్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి బూత్‌స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడంలో ప్రతి ఒక్కరు కీలక పాత్ర పోషించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 184 పంచాయతీ కార్యదర్శులు పదోన్నతులు పొందనున్నారు. ఈ మేరకు అర్హులైన గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు సీనియారిటీ జాబితాను అధికారులు విడుదల చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో గ్రేడ్-1 (నిల్), గ్రేడ్-2లో (8), గ్రేడ్-3లో (7), గ్రేడ్-4లో (64), గ్రేడ్-5లో (12), నంద్యాల జిల్లాలో గ్రేడ్-3, గ్రేడ్‌లో (3), గ్రేడ్-2లో (10), గ్రేడ్-3లో (9), గ్రేడ్-4లో (54) గ్రేడ్-5లో (17) ఖాళీలు ఉన్నాయి. వీటిని రోస్టర్, మెరిట్ ప్రాతిపదికన పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులను కల్పించనున్నారు. ఇటీవల రెవెన్యూ శాఖలో రెవెన్యూ సిబ్బందికి 44 మందికి సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐలుగా పదోన్నతులు ఇచ్చారు. అదే విధంగా 161 మంది గ్రేడ్-2 వీఆర్వోలకు త్వరలో గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతి పొందనున్నారు.

జడివాన

- కరెంటు సరఫరా నిలిపివేతతో చిమ్మచీకట్లు
- మార్కెట్ యార్డులో కూరగాయల రైతు అవస్థలు
- పిడుగులు పడి ఒకరు మృతి.. స్పృహ తప్పిన ఆరుగురు



రైతు ఆశలు నేలమట్టం.. బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలో వరి పైరు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షం రాకతో కాస్త ఉపశమనం పొందారు. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జడివాన కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై కనిపించగా సాయంత్రం పలుచోట్ల రెండు గంటల దాకా వరుణుడు కరుణించాడు. ఉమ్మడి జిల్లా అంతటా ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. కర్నూలు నగరంతో పాటు పత్తికొండ, కోడుమూరు, డోన్, పాణ్యం, కొలిమిగుండ్ల, ప్యాపిలి తదితర మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఎమ్మిగనూరులోని కందనాతి గ్రామంలో పిడుగు పడి రవి (15) అనే యువకుడు మృతి చెందాడు. సి.బెళగల్ మండలం యనగండ్ల క్రాస్ రోడ్డు వద్ద పిడుగు పడి ఆరుగురు స్పృహ తప్పి పడిపోయారు.

మండువేసవిలో వాన

మహానంది, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మహానందిలో ఉదయం నుంచి వాతావరణం చల్లబడింది. దీంతో మహానంది క్షేత్రానికి దైవదర్శనం కోసం వచ్చిన భక్తులు ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందారు. గంటపాటు ఏకధాటిగా వర్షం కురవడంతో క్షేత్ర వీధులన్నీ జలమయం అయ్యాయి. అలాగే ఎం.తిమ్మాపురం, బుక్కాపురం, తమ్మడపల్లి, శ్రీనగరం గ్రామాల్లో ఈదురు గాలులకు పలుచోట్ల అరటిచెట్లు నేలకొరిగాయి. రైతులు ఆరబోసిన పసుపు దిగుబడి తడిసింది.



జాగ్రత్త పడ్డారు.. పగిడ్యాల మండలం: నెహ్రూనగర్ సమీపంలో మొక్కజొన్నపై పట్టాలు



మహానంది మండలం బుక్కాపురంలో తడిసిన పసుపు దిగుబడి

రైతుల ఇబ్బందులు

పగిడ్యాల: ఉపరితల ఆవర్తన ప్రభావంతో మండలంలోని గామాల్లో గురువారం తేలికపాటి వర్షం కురిసింది. ప్రస్తుతం కేసీ కాలువ కింద రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట నూర్పిడి చేసి ధాన్యాన్ని కళ్లాల్లో నిల్వ చేసుకున్నారు. వర్షం కురవడంతో ధాన్యం తడవకుండా రైతులు ఇబ్బంది పడ్డారు.

నేలమట్టమైన వరి పంట

బండిఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. గురువారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన రావడంతో ఈర్నపాడు, కడమలకాల్వ, వెంగళరెడ్డిపేట, మణికరపురం, శింగవరం, సోమయాజులపల్లె గ్రామాల్లో వేలాది ఎకరాల్లో వరి పంట పూర్తిగా నేలమట్టమైంది.

కళ్లెదుటే నేలమట్టం



9 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. మరో పది రోజుల్లో చేతి కందాల్సిన పంట కళ్లెదుటే నేలమట్టమైంది. ఎకరాకు 10 బస్తాలకు పైగానే దిగుబడి తగ్గిపోతుంది. అసలే రబీ పంట ధర లేదు. దీంతో అప్పులు తప్పవు. ప్రభుత్వం పంట నష్టం అందించి ఆదుకోవాలి. - **నాగిరెడ్డి, ఈర్నపాడు, బండి ఆత్మకూరు**

కొలిమిగుండ్ల: మండలంలోని తిమ్మనాయినిపేట, కోటపాడు, బెలుం, బెలుంశింగవరం తదితర గ్రామాల్లో గురువారం వర్షం కురిసింది. రైతులు కలాల్లో ఆరబోసిన పంట దిగుబడులు దెబ్బతిన్నాయి. తిమ్మనాయినిపేట గ్రామంలో పసుపు రైతులకు నష్టం వాటిల్లినట్లు వాపోతున్నారు.



కొలిమిగుండ్ల: తడిసిన పసుపు పంట



ఓర్వకల్లు బస్టాండు వద్ద వర్షపు నీరు

మెరుపు ప్రభావంతో ఆరుగురికి అస్వస్థత

సి. బెళగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగండ్ల క్రాస్‌రోడ్డులో ఆర్టీసీ బస్సు కోసం వేచి ఉన్న ఆరుగురు ప్రయాణికులు మెరుపు ప్రభావానికి గురై అస్వస్థతకు గురయ్యారు. ఆ దారిలో కారులో వెళుతున్న టీడీపీ మాజీ మండల కన్వీనర్ డాక్టర్ తిమ్మప్ప మెరుపు ప్రభావంతో స్పృహ కోల్పోయిన వారిని తన వాహనంలో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ తిమ్మారెడ్డి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని మెరుపు దాడికి గురైయిన వారి వివరాలు తెలుసుకుని, వారి బంధువులకు సమాచారం అందజేసి నట్లు తెలిపారు.

కర్నూలులో కుమ్మేసిన వాన



కర్నూలులో గురువారం రాత్రి కురుస్తున్న వర్షం

కర్నూలు నగరంలో రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు కర్నూలు నగరంలో దాదాపు రెండు గంటల సేపు వాన దంచి కొట్టింది. కరెంటు సరఫరా నిలిపివేయడంతో బళ్లారి చౌరస్తా పరిధిలోని సంపత్‌నగర్, విఠల్‌నగర్, ఠాగూర్ నగర్, మురారినగర్, తదితర కల్లూరు పరిధిలోని కాలనీల ప్రజలు చిమ్మచీకటిలోఇబ్బందులు పడ్డారు. కర్నూలు మార్కెట్‌యార్డులో రాత్రి సమయంలోనే రైతులు కూరగాయలను విక్రయానికి తెస్తుంటారు. జడివానకు రైతులు తెచ్చిన కూరగాయలు తడిసిపోయాయి.

పిడుగుపాటుకు బాలుడి మృతి

- మరో ముగ్గురికి గాయాలు



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్



బోయ రవి(ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పిడుగు పాటుకు గురై 15ఏళ్ల బాలుడు మృతి చెందిన విషాద సంఘటన గురువారం జరిగింది. గ్రామానికి చెందిన మారెన్న, మస్తానమ్మల కుమారుడు బోయ రవి(15) పొలం పనుల నిమిత్తం పొలానికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో వర్షపు జల్లులు పడడంతో రవితో పాటు అదే గ్రామానికి చెందిన గజ్జన్న, తిక్కయ్య, స్టాలిన్ కూడా చెట్టుకిందకు వెళ్లారు. ఒక్కసారిగా పిడుగు పడడంతో చెట్టు కింద ఉన్న రవి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతి చెందిన బాలుడు రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారికి గజ్జన్న, తిక్కయ్య, స్టాలిన్‌లకు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. తహసీల్దార్ శేషఫణి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎయిర్‌పోర్టులో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- జాయింట్ కలెక్టర్ నవ్య



కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అన్ని చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి. నవ్య ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్‌ను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏరోడ్రోమ్ కమిటీ, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్‌మెంటు కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు ఆవరణలో పచ్చదనాన్ని గణనీయంగా పెంచే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, డీఎంహెచ్‌వో డా. శాంతికళ, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, ఐబీ డీఎస్పీ మధు, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి, డీడీ మైన్స్ రవిచంద్ర, ఎలక్ట్రికల్ డీఈ శేషాద్రి, ఎంపీడీవో శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి ఆత్మహత్య

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాపరాతి గనుల్లో ట్రాక్టర్‌కు వెళుతూ, గని కార్మికుడిగా జీవనం సాగిస్తున్న వెంకటరామిరెడ్డి(48) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర ఘటన గురువారం చోటు చేసుకుంది. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన ఉమ్మడి రామిరెడ్డి కుమారుడు వెంకటరామిరెడ్డి గత 15 సంవత్సరాల క్రితం అంకిరెడ్డిపల్లె గ్రామానికి చేరుకొని, గనుల్లో ట్రాక్టర్‌కు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. కాగా వెంకటరామిరెడ్డి మద్యానికి బానిసగా మారి, తరచూ భార్య వసుంధరతో గొడవ పడి వేధిస్తుండటంతో నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. వీరికి ఎటువంటి సంతానం లేదు. గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో వెంకటరామిరెడ్డి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వెంకటరామిరెడ్డి సూసైడ్ నోట్ రాసుకున్నారని చెప్పారు. కొలిమిగుండ్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

కర్నూలు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారపేటలో బాలకృష్ణ (36) అనే యువ కుడు ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గతంలో కారు డ్రైవర్‌గా పని చేస్తూ ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. భార్య సంపాదనపై ఆధారపడి తాగుతూ తిరుగుతుండేవాడు. మద్యం మత్తులో ఇం ట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా బంధువులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తపేటకు చెందిన షేక్ ముత్తాజ్(35) అనే మహిళ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. భర్త షకీల్ బాషా గౌండా పని చేస్తుంటాడు. అనారోగ్యంతో బాధపడుతూ ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అలాగే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కరీముల్లా (38) అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకు న్నాడు. ఈయన కాలు ప్రమాదంలో విరిగిపోయింది. గత కొద్ది కాలంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. భార్య పిల్లలు ఊరు వెళ్ల డంతో అనారోగ్య సమస్యలు వేధిస్తుండటంతో మనస్తాపానికి గురైన ఆయన ఉరి వేసుకున్నాడు. సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సీపట్నం వైసీపీ నాయకుడి అరెస్టు



డోన్‌లో కోర్టుకు వైసీపీ నాయకుడు కర్రి శ్రీనివాసులును తీసుకువస్తున్న పోలీసులు

డోన్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నర్సీపట్నం వైసీపీ నాయకుడుని పోలీసులు అరెస్టు చేశారు. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలం జలదుర్గం పోలీస్ స్టేషన్‌లో పీరా అనే వ్యక్తి ఫిర్యాదుపై నర్సీపట్నానికి చెందిన వైసీపీ నాయకుడిపై జలదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా పోలీసులు నర్సీపట్నం వెళ్లి తన కార్యాలయంలో ఉన్న వైసీపీ నాయకుడు కర్రి శ్రీనివాసులను అరెస్టు చేసి నంద్యాల జిల్లా మీదుగా డోన్ కోర్టుకు తీసుకువచ్చి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు కండీషన్ బెయిల్ మంజూరు చేసినట్లు జలదుర్గం పోలీసు అధికారులు తెలిపారు.

ఆదివాసులపై యుద్ధం నిలిపివేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యం ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసులపై చేస్తున్న యుద్ధాన్ని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ముందు ఆదివాసుల హత్యలకు, ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. కన్వీనర్ అల్లాబకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రజా అభ్యుదయ సంస్థ నాయకుడు భార్గవ మాట్లాడుతూ నేడు ఛత్తీస్‌ఘడ్‌లో అన్ని అధికా రాలను సైన్యం గుప్పిట్లోకి తీసుకుందని, కార్పొరేట్ కంపెనీల కోసం ప్రభుత్వం చేస్తున్న ఈ యుద్ధాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విరసం బాధ్యుడు పాణి మాట్లాడుతూ తక్షణమే భారత ప్రభుత్వం సైన్యాన్ని వెనక్కి తీసుకొని, యుద్ధాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, కుల నిర్మూలన పోరాట సమితి నాయకుడు సుబ్బారాయుడు, పోస్టల్ యూనియన్ నాయకులు మల్లేశ్వరరెడ్డి, యోహాను, రాయలసీమ విద్యావంతుల వేదిక బాధ్యుడు రత్నం ఏసేపు తదితరులు మాట్లాడారు.

బాలుడి అనుమానాస్పద మృతి



నాని (ఫైల్)

కర్నూలు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వీకర్ సెక్షన్ కాలనీలో నాని (14) అనే విద్యార్థి అనుమానస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. వెల్దుర్తికి చెందిన బజారికి మహాదేవికి పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కొడుకు, ఇద్దరు కూతుళ్లు సంతానం. కొన్ని రోజుల క్రితం నాని తల్లి మహాదేవి కూడా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నానితో పాటు ఇద్దరు చెల్లెళ్లు రామకృష్ణాపురంలో మేనమామ మధు వద్ద ఉంటున్నారు. నాని లద్దగిరి ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్నాడు. తండ్రి బజారి మరో రెండో పెళ్లి చేసుకుని కర్నూలులో నివాసం ఉంటున్నాడు. నాని తరచుగా తండ్రి వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. బుధవారం కూడా తండ్రి బజారి వద్దకు వచ్చాడు. అర్ధరాత్రి తర్వాత నాని ఉరి వేసుకున్నాడని తండ్రి బజారి మధుకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో మధు, బంధువులు కర్నూలు వచ్చి నాని మృతదేహాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాని మృతికి తండ్రి బజారి, అతడి రెండో భార్య లిల్లి కారణమై ఉండవచ్చని అనుమానిస్తూ మధు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదన్‌గౌడు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గూడూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బోయ రవి(36) మృతి చెందాడు. గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడికి చెందిన రవి గూడూరు మండలంలోని మునగాల గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్ళాడు. బుధవారం మునగాల నుండి సొంత ఊరు హెచ్ కైరవాడికి బోయ రవి భార్య లక్ష్మితో బైక్‌పై వెళ్తుండగా, చనుగొండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చనుగొండ్ల నుండి సుంకేసుల వైపు బైక్‌పై వెళ్తూ మునగాల - గూడూరు మధ్యలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన బోయ రవిని పోలీసులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రవి బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

12 మందిపై కేసు నమోదు

ఆదోని రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన 12మందిపై కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్సై నాగేంద్ర తెలిపారు. గురువారం మాట్లాడుతూ పొలాల్లో ఎల్లెల్సీ నీటి వాటా విషయంలో బుధవారం గ్రామానికి చెందిన పాండు వర్గీయులు, లోకేష్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకొందని, ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్సై తెలిపారు.

వసతి గృహం తనిఖీ



వసతి గృహం నిర్వాహకులిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా గాంధీ నగర్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి గురువారం తనిఖీ చేశారు. కార్యాలయానికి సంబంధిం చిన రిజిస్టర్లను చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించడం లేదని గుర్తించి నిర్వాహకులిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిరాశ్రయులకు అందించే భోజన వైద్యసదుపాయాల గురించి అక్కడుంటున్న వారిని ఆరా తీయగా.. సౌకర్యాలు బాగా లేవని వృద్ధులు ఆయనకు వివరించారు. దీంతో న్యాయా ధికారి అక్కడి వసతులను వెంటనే మెరుగు పరుచుకోవాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులకు హెచ్చరించారు. ఆయన వెంట వసతి గృహం నిర్వాహకురాలు శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత


సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. ఆరోగ్య సమస్యలతో వైద్యం చేయించుకుని సీఎం సహాయ నిధికి ఎంపికైన అర్హులకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులను అందజేశారు. పాణ్యం నియోజకవర్గంలో 16మందికి మొత్తం రూ.16,38,071 చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ: కల్లూరు అర్బన్ 27, 31 వార్డుల్లో రూ.129.80 లక్షలతో కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి ఎమ్మెల్యే గౌరు చరిత భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సి పల్ ఎస్ఈ రాజశేఖర్, 31, 29వ వార్డు ఇన్‌చార్జిలు శైలజా యాదవ్, శ్రీనివాసరావు, చరణ్ యాదవ్, కార్పొరేటర్ మిద్దె చిట్టెమ్మ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మండలంలోని హుశేనాపురం గ్రామంలో మండల సమైక్య గౌరవ సలహాదారాలు విజయ భారతి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమానికి గురువారం ఎమ్మెల్యే గౌరు చరిత ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు వెంకటేశ్వరస్వామి చిత్రపటానికి పూజలు చేశారు. శిక్షణ పొందుతున్న పొదుపు మహిళలకు కుట్టుమిషన్ పరికరాలు పంపిణీ చేశారు. ఈ శిక్షణలో 35 మందిని ఎంపిక చేసి వారికి 29 రకాల డిజైన్లు నేర్పించి సర్టిఫికెట్లు ఇస్తామని ఆర్‌సెటి డైరెక్టర్ పుష్ప తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి టైల రింగ్‌పై శిక్షణ ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఓర్వకల్లు మండల మహిళలు పొదుపులక్ష్మిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, మండల ఐక్యసంఘం అధ్యక్షురాలు రత్నమ్మ, సర్పంచ్ గోవర్ధనమ్మ, ఉప సర్పంచ్ షమీనా, నాయకులు చంద్రపెద్దస్వామి, మహబూబ్ బాషా, రాము, కాటినేని నారాయణ, నాగరాజు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

చౌక దుకాణాలపై అధికారుల దాడులు


చౌక దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని చౌకదుకాణాలపై విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు పలు ప్రాంతాల్లో గురువారం దాడులు నిర్వహించారు. రేషన్‌షాపు 53లో 3290 కేజీల బియ్యం, 604 కేజీల జొన్నలు, భౌతిక నిల్వల్లో తక్కువ ఉండటం, రేషన్‌షాపు 162లో 1800 కేజీల బియ్యం, 286 ప్యాకెట్ల చక్కెర ఎక్కువ ఉండటంతో నిత్యావసర సరుకుల చట్టం 1955 సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజారఘువీర్, నగర సహాయ సరఫరాల అధికారి రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, విజిలెన్స్ డిపార్టుమెంటు అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే రోగాలు దరిచేరవని కిమ్స్ హాస్పిటల్ ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ ఎస్ఎం వెంకటేశ్వర్లు అన్నారు. కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎస్‌ఏపీ క్యాంపు కట్టమంచి రామలిం గారెడ్డి స్మారక నగర పాలక ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిమ్స్ మేనే జర్ బాషా, పాఠశాల కమిటీ చైర్మన్ కుమార్, హెచ్ఎం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ టి.శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓల్డ్‌టౌన్ సెక్షన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో కరెంట్‌కోత ఉంటుందన్నారు. ఈమేరకు పెద్దమార్కెట్, ఖండేరి, కొత్తపేట, షరాఫ్‌బజార్, వడ్డెగేరి, ఖడక్‌పురా, మించిన్‌బజార్, ఖల్లా, సాయిబాబా టెంపుల్, నాగప్ప స్ట్రీట్, కిడ్స్‌వరల్డ్, జిల్లా కోర్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు గో సంరక్షణశాలలో అన్నాభిషేకం

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని కిడ్స్ వరల్డ్ సమీపం లోని జిల్లా గో సంరక్షణశాలలో శుక్రవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పరమేశ్వరుడికి అన్నాభిషేకం జరుగుతుందని గాయత్రి గోసేవ సమితి కార్యదర్శి రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.45 గంటలకు ఈ కార్యక్రమం దేవదాయ శాఖ, గాయత్రి గోసేవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

రేపు జేసీజే మోడల్ టెస్టు

కర్నూలు లీగల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసూన న్యాయ కళా శాలలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) నిర్వహించనున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి మోడల్ టెస్టును యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని ఐఏఎల్ జిల్లా కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో ఈ మోడల్ టెస్టును ఈనెల 5న నిర్వహి స్తుందని తెలిపారు. ఈనెల 16న జరగనున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి రాత పరీక్షకు హాజరుకానున్న యువ న్యాయవాదులకు ఈ మోడల్ టెస్టు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సెల్.నెంబర్లు 9393822654, 9393823106 నెంబర్లకు ఫోన్ చేసి శుక్రవారం సాయంత్రంలోపు పేరు నమో దు చేసుకోవాలని కోరారు.

ఓర్వకల్లులో వర్షం

ఓర్వకల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లు, నన్నూరు, పూడిచెర్ల, హుశేనాపురం, కన్నమడకల, తది తర గ్రామాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. మండుతున్న ఎండలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఆయా కాలనీల్లో వర్షం నీరు పారుతుంది. దీంతో బోర్లలో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది.

మొరాయిస్తున్న లిఫ్టు


పనిచేయని క్యాజువాల్టీ లిఫ్టు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాజువాల్టీ వద్ద ఏర్పాటు చేసిన లిఫ్టు మొరాయిస్తుంది. గురువారం ఉదయం సాంకేతిక లోపంతో లిఫ్టు మధ్యలోనే ఆగిపోయింది. ఆ సమయంలో లిఫ్టులో కొందరు అధికారులు ఉన్నారు. దీంతో అక్కడున్న భద్రత సిబ్బంది లిఫ్టులో ఇరుకున్న అధికారులను, ఉద్యోగులను తలుపు తెరిపించి బయ టకు తీశారు. అలాగే బుధవారం మధ్యాహ్నం 8 మంది సూపరిం టెండెంట్ కార్యాలయ ఉద్యోగులు లిఫ్టులో చిక్కుకోవడంతో భద్రతా సిబ్బంది అతి కష్టమీద సురక్షితంగా బయటపడ్డారు. దాదాపు 15 నిమిషాలు ఉద్యోగులు నరకయాతన అనుభవించారు. 10 రోజుల క్రితమే లిఫ్టుకు మరమ్మతులు చేశారు. అయినా కూడా గత రెం డు రోజుల నుంచి మళ్లీ లిఫ్టు మొరాయిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి లిఫ్టుకు శాశ్వతంగా మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

వక్ఫ్ బోర్డు ఉనికికే ప్రమాదం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు నష్టపరిచేలా వక్ఫ్ చట్టంలో మార్పులు తెచ్చి వక్ఫ్ బోర్డు ఉనికికే కేంద్ర ప్రభుత్వం ప్రమాదం తెచ్చిందని ఫెడరేషన్ ఆఫ్ ముస్లిం అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఏ. హమీద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వక్ఫ్ బిల్లు పేరును ఉమీద్‌గా మార్చడం దారుణమన్నారు.

కర్నూలు అర్బన్: వక్ఫ్ బిల్లులను రాజ్యాంగ ప్రాథమిక స్వరూపంపై దాడిగా అభివర్ణిస్తున్నామని మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రె స్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని నీరుగార్చే ప్రయత్నాన్ని బీజేపీ ప్ర భుత్వం చేస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ బోర్డుకు ఒక ముస్లిం ఆస్తిని విరాళం ఇవ్వాలంటే కనీసం ఐదేళ్లు ముస్లిం మతాన్ని ఆచరించినట్లు ధ్రువీకరించాలని అని పేర్కొనడం మంచి సంప్రదాయం కాదని అన్నారు.

6న సీతారాముల కల్యాణం


ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న మహోత్సవ కమిటీ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని మున్సిపల్ హైస్కూ ల్ గ్రౌండ్‌లో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఈనెల 6న సాయంత్రం 6.30 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు కర్నూలు సీతారా ముల కల్యాణ మహోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.క్రిష్టన్న, మహేం ద్రకర్ నాగోజీరావు తెలిపారు. గురువారం సుంకేసుల రోడ్డులోని ఆవోపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వేడు కలకు మంత్రి టీజీ భరత్‌తోపాటు పలువురు అధికారులను ఆహ్వానించినట్లు తెలిపారు. 2023లో అయోధ్యలో రామమందిరం ప్రారంభించిన నాటి నుంచి ఏటా శ్రీరామ నవమి రోజున కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

రేపటి నుంచి వేడుకలు ప్రారంభం: సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని కమిటీ కోశాధికారి కల్కి మురళి తెలిపారు. నగరంలోని కిడ్స్ వరల్డ్ సమీపంలోని గో సంరక్షణ శాలలో స్వామి, అమ్మవార్లకు పసుపు, తలంబ్రాల సేవ, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరు మంజన సేవ, ఆదివారం సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9 గంటల వరకు సీతారాముల కల్యాణం ఉంటుందని తెలిపారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో భక్తులందరికీ ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ ఇతర ప్రతినిధులు ఆవోపా నాగేశ్వరరావు, ఎస్‌జీ మహాబలేష్, ఎస్వీ నారాయణరెడ్డి, చల్లా దామోదర్ రెడ్డి, అచ్చిస్వామి పాల్గొన్నారు.

భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధం కావాలి

ఏఐబీడీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు యాకోబు


బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, పెన్షనర్లు పోరాటాలకు సిద్ధం కావాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఏఐబీడీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు యాకోబు పిలుపునిచ్చారు. గురువారం ప్రకాష్‌నగర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యాకోబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన పెన్షన్ రూల్స్ అతి ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ఈ బిల్లు ఆమోదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్య దర్శి విజయభాస్కర్, ఏఐబీఎస్ఎన్ఎల్ పీడబ్ల్యూఏ జిల్లా కార్యదర్శి జేవీ రమణ, రామాంజనేయులు, భాస్కరరావు, ఎస్ఎన్‌పీడబ్ల్యూఏ నాయకుడు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దేశం, రాష్ట్రంలో రోజురోజుకి మహిళలకు రక్షణ కరువైందని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణిరెడ్డి అన్నారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మూడు రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా ఉరకొండ పేటలో దైవ దర్శనానికి వెళ్లిన ఓ మహిళపై కొందరు దుండగులు సామూహిక అత్యాచారం చేశారని అన్నారు. దుండగులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. అదేవిధంగా విశాఖపట్టణంలో ఓ ప్రేమో న్మాది తన ప్రేమను తిరస్కరించారని తల్లి, కూతుర్లపై విచక్షణా రహితంగా దాడి చేయడం దారుణమన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రమ్మ, భారతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రావణిరెడ్డి

పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తాం: ఎమ్మెల్యే


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కోడుమూరులో టీడీపీ కార్యాలయాన్ని త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. స్థానిక నీటి పారుదలశాఖ కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యాలయం ఏర్పాటుకు స్థల సమీకరణ చేస్తున్నామన్నారు. అంతేకాకుండా పార్టీ కార్య కర్తల కష్ట, సుఖాలను పాలు పంచుకొంటూ పార్టీని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. మండలంలోని సమస్యలపై కార్యకర్తలతో చర్చించారు. కోడుమూరులో ప్రతి ఆర్టీసీ బస్సు ఆగే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని కార్యకర్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఆర్టీసీ ఆర్‌ఎంతో మాట్లాడి సమస్యను పరిష్క రిస్తానని హామీ నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కేఈ మల్లికార్జునగౌడ్, గోపాల్‌నాయుడు, బడెసాగౌడ్, కేయి రఘుబాబు, రాముడు, మునిస్వామి, రవీంద్రగౌడ్ పాల్గొన్నారు.

పీఎంఏజేఏవై చెక్కు అందజేత

కర్నూలు రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం పసుపుల గ్రామంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తన స్వగృహంలో డ్వాక్రా గ్రూపు సభ్యురాలు సువర్ణమ్మకు పీఎంఏజేఏవై సంబంధించిన రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దిగువపాడు గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళ సువర్ణమ్మకు పీఎంఏజేఏవై కింద రూ.లక్ష మంజూరు చేయించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కును ఆమెకు అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎన్ఎంయూ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

కర్నూలు రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కర్నూలు-2డిపో గ్యారేజీ ఎదుట ఆ యూనియన్ నాయకులు, కార్మి కులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి పీఎండీ ఇస్మాయిల్ పాల్గొని కార్మికులనుద్దేశించి మాట్లా_డారు. ఆర్టీసీలో ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగులపై అధికారుల వేధింపులు మానుకోవాలని కోరారు. రీజనల్ ప్రెసిడెంట్ ఎన్‌ఆర్‌నాయుడు, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పీపీ వలి, డిపో కార్యదర్శి ఇసాక్, ఎంఎస్‌రెడ్డి, గ్యారేజీ కార్యదర్శి రవీంద్ర బాబు, తిమ్మప్ప పాల్గొన్నారు.

డీసీఎంఎస్‌కు ఉద్యోగులకు జీతాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వక పోవడం వల్ల పస్తులతో ఉండాల్సి వస్తోందని ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన వార్తకు స్పందన లభించింది. డీసీఎంఎస్ సంస్థకు మార్క్ ఫెడ్ ద్వారా విడుదల కావాల్సిన నిధులు దాదాపు నాలుగైదేళ్లుగా పెం డింగ్‌లో ఉన్నాయి. దీంతో డీసీఎంఎస్ సంస్థ అధికారులు, ఉద్యోగులకు జీతాలు అందించలేని పరిస్థితి నెలకొందని ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచు రితమైంది. దీంతో మార్క్‌ఫెడ్ సంస్థ రెండు రోజుల క్రితం డీసీఎంఎస్ సంస్థకు ఇవ్వాల్సిన నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నవంబరు, డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి డీసీ ఎంఎస్ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బందికి జీతాలు విడుదల చేశామని మేనేజర్ రాజేష్ తెలిపారు.

రేపు కర్నూలుకు గరికపాటి రాక

నెహ్రూనగర్ సత్యసాయి కళాక్షేత్రంలో ప్రవచనం


ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న పుట్టపర్తి సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మహా శతావధాని, పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు శనివారం కర్నూలుకు రానున్నారు. పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా కర్నూలులోని నెహ్రూ నగర్‌లోగల సత్యసాయి కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవచన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. గురువారం సాయంత్రం నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమం వివరాలు తెలియజేసే ఆహ్వాన పత్రికలను సత్య సాయి సంస్థ జిల్లా అధ్యక్షుడు డి.సాయికృష్ణారెడ్డి, పూర్వ అధ్యక్షుడు సాయిబాబా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్య సాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా నూతన సత్యసాయి కళాక్షేత్రం లో గరికపాటి ప్రవచన బోధన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. 'శ్రీమద్ రామాయణం' మానవతా విలువలు, వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై గరికపాటి ప్రసంగిస్తారని, ఈ కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్‌ను ఆహ్వా నించామన్నారు. కార్యక్రమంలో సేవా సంస్థల కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, సత్యసాయి సేవాదళ్ జిల్లా ఇన్‌చార్జి లక్ష్మీసరోజ, యువత విభాగం కోఆర్డినేటర్ గీతావాణి, రామ్మోహన్ పాల్గొన్నారు.


చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు సహకరించాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

ఓర్వకల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చలివేంద్రాల ఏర్పాట్లుకు దాతలు సహకరించాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య అన్నారు. గురువారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డ్వామా పీడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటా_డుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడుతా యన్నారు. ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని దాతలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ రంగనాథగౌడు, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటితొట్లను సద్వినియోగం చేసుకోవాలి


భూమి పూజ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు సురేష్

గూడూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మూగజీవాల దాహం తీర్చేందుకు ప్రభుత్వం నిర్మిస్తున్న నీటితొట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్ సూచించారు. గురువారం గూడూరు మండలం కె నాగలాపురం గ్రామంలో నీటి తొట్టి నిర్మాణానికి జె సురేష్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునెప్ప, చిన్న సుంకన్న, నాగరాజు, విజయ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. తపాలా కార్యాలయంలో గురువారం పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా స్కాలర్ షిప్ పరీక్ష 2024-25 సంవత్సరానికి ఉత్తీర్ణులైన ఇద్దరు ఎన్‌ఆర్‌పేట సెయింట్ జోసఫ్ పాఠశాల విద్యార్థులకు(షేక్ మహ్మద్ ఫైజాన్ 6వ తరగతి, ఎం.జ్యోతి స్వరూప్ 7వ తరగతి) రూ.6 వేలు స్కాలర్ షిప్, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం పోస్టల్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను సూపరిం టెండెంట్ వివరించారు. విద్యార్థులకు ఫిలాటలీ(స్టాంపు సేకరణ), మైస్టాంప్, ఢాయి ఆఖర్ లెటర్ రైటింగ్ గురించి వివరించారు.

మత కల్లోలాలు సృష్టించేందుకు బీజేపీ కుట్ర

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దేశంలో మతకల్లోలాలు సృష్టించేందుకు బీజేపీ కుట్ర పన్నుతుందని కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం రాయల్‌ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో వక్ఫ్ చట్టంపై సుదీర్ఘ చర్చ జరిగిన అనంతరం బిల్లును ఆమోదించా రని అన్నారు. పార్లమెంటులో ఈ బిల్లుకు ప్రతి ముస్లిం ఎంపీలు వ్యతిరేకించారన్నారు. బీజేపీ తీసుకువచ్చిన కొత్త వక్ఫ్ బిల్లులో అన్ని తప్పులు ఉన్నట్లు నిర్ధారణకు వచ్చామన్నారు. బిల్లుపై చాలా మంది వ్యతిరేకంగా ఓట్లు వేసారని ఆయన గుర్తు చేశారు. అన్ని ముస్లిం సంఘాలు బిల్లును వ్యతిరేకించినా ఉద్దేశపూర్వకంగా ఈ బిల్లును తెరమీదకు తెచ్చారన్నారు. రాజకీయ లబ్ధి కోసం వక్ఫ్ భూములను కాజేయడానికే ఈ బిల్లును తీసుకువచ్చారని విమర్శించారు. వక్ఫ్ భూములపై కలెక్టర్‌కు అధికారం ఇవ్వడం వల్ల టీడీపీ నాయకులు ఏమి చెబితే అదే జరుగుతుందని, దీంతో భూములు అన్యాక్రాంతం అవుతాయని అన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు ముస్లింలకు అండగా ఉంటామని చెప్పి వక్ఫ్ బిల్లుకు మద్దతు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు.

వర్క్‌షాపును జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 12, 13 తేదీల్లో జరిగే సీఐటీయూ రాష్ట్రస్థాయి వర్క్‌షాపును జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు పిలుపునిచ్చారు. గురువారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలను చైతన్యవంతం చేయడానికే రాష్ట్ర నాయకత్వం వివిధ ప్రాంతాలలో వర్క్‌షాపులను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులేసు హాజరవుతారన్నారు. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు నాగేశ్వరరావు, సీహెచ్ సాయిబాబా, విజయ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

జీవనోపాధులను మెరుగుపరుచుకోండి

ఓర్వకల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు జీవనోపాధులను మెరుగు పరుచుకోవాలని ఏపీఎం వెంకట్రామిరెడ్డి సూచించారు. గురువారం ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి ఐక్యసంఘం భవనంలో ఎస్ఎస్ ఎన్యుమరేటర్స్‌కు, వీవోఏలకు మాన్యువల్ క్రెడిట్ లైవ్‌లీ ఫుడ్ యాక్షన్ ప్లాన్ కోసం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీసీలు, ఎన్యుమరేటర్స్, వీవోఏలు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన


క్రీడాకారుడిని అభినందిస్తున్న కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన క్రీడాకారుడు విశ్వాసరావు సాయి తైక్వాండోలో బ్లాక్‌బెల్ట్ సాధించాడు. గురువారం విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి తన స్వగృహంలో విశ్వాసరావును అభినందించారు. కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు తమ సాయం అందిస్తామన్నారు. తైక్వాండో శిక్షకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సి.బెళగల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం రమేష్ సూచించారు. గురువారం మండల వెలుగు కార్యాలయంలో బుక్ కీపర్లకు శిక్షణ తరగ తులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బుక్ కీపర్లు, సీసీలు పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించాలి

తుగ్గలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ రమాదేవి కోరారు. గురువారం ముక్కెళ్ల గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సభలో మాట్లాడుతూ రీ సర్వేతో రైతులకు ఇబ్బందులు ఉండవని, భూములకు ఖచ్చితమైన కొలతలు వేసి ఇస్తామన్నారు. ఇతర సమస్యలున్నా పరిష్కారిస్తామన్నారు. ఈ సమావేశంలో డీటీ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, వీఆర్వో రెహిమాన్, రంగప్ప తదితరులు ఉన్నారు.

బాలికలను ప్రోత్సహించాలి


అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ అధికారి రూప్ సింగ్

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీలో చేరేందుకు బాలికలను ప్రోత్సహించాలని కర్నూలు బెటాలియన్ ఎన్‌సీసీ అధికారి రూప్‌సింగ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ మైదానంలో పరేడ్‌పై అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ దేశంలోనే అతిపెద్ద వ్యవస్థ అని, విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ, కర్తవ్యం, ఐకృత, దేశభక్తిని ఎన్‌సీసీ ద్వారా అలవర్చుకోవచ్చు అన్నారు. ఇది బాలికల స్వీయ రక్షణకు ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు ఉంటాయని సూచించారు. హవల్దార్ షేక్షావలి, ఎన్‌సీసీ ఆఫీసర్ పరిమళ పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని కాజేస్తే చర్యలు

మద్దికెర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని కాజేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ హెచ్చరించారు. గురువారం కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. బియ్యాన్ని సక్రమంగా లబ్దిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేయాలని సూచించారు. ఈ నెల 30వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేయాలని తెలిపారు. మరణించిన వారు, వివాహం చేసుకుని వెళ్లిన వారి పేర్లు తొలగించాలని ఆదేశించారు. సీనియర్ అసిస్టెంట్ రవి ఉన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

దేవనకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం నాయకుడు వీరశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లాలో కరువు మండలాల ఎంపిక అశాస్త్రీయంగా చేశారని ఆరోపించారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టిన పెట్టుబడులు కుడా రాక రైతులు అప్పులలో కురుకుపోయారన్నారు. అనంతరం తహసీల్దార్ ప్రసాదురాజుకి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అశోక్, యూసుప్‌బాష, రంగన్న, సూరి, రామాంజినేయులు, రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సారథులు


మాట్లాడుతున్న గిరి మల్లేష్ గౌడ్

ఆలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే కుటుంబ సాధికార సారథులను నియమిస్తున్నట్లు ఆలూరు టీడీపీ నాయకుడు గిరి మల్లేష్ గౌడ్ తెలిపారు. గురువారం గురువారం స్థానిక ఇబ్రహీం ఫంక్షన్ హాల్ వద్ద మాట్లాడుతూ గ్రామాల్లో 60 మందికి ఇద్దరు చొప్పున పార్టీ సభ్యులను కుటుంబ సాధికార సారథులను నియమిస్తున్నామని, వీరి ద్వారా సంక్షేమ పథకాలను అమలు, సమస్యలను కూడా పరిష్కరిస్తార న్నారు. ఇందుకుక పార్టీ ఇన్‌చార్జి వీరబద్ర గౌడ్ కృషి చేస్తారని, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు.

సవరణతో ముస్లింలకు అన్యాయం

ఆదోని టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో ముస్లింలకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ నూర్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా అంబేద్కర్ కూడలిలో గురువారం నిరసన తెలిపారు. ఈ బిల్లును ముస్లింలపై దాడిగా భావిస్తున్నామన్నారు. బిల్లుకు టీడీపీ, జనసేన నాయకులు కూడా మద్దతు తెలపడం సమంజసం కాదన్నారు. తాయన్న, అమన్, నాసిర్, మహబూబియా టాకీస్, రఫీక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నూర్

9 నుంచి ఉరుసు

వెల్దుర్తి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరన్నగట్టు కొండపై ఉనన వన్నూర్ షా వలి ఉరుసు ఈ నెల 9 నుంచి ఉంటుందని నిర్వాహకుడు నబీ రసూల్ గురువారం తెలిపారు. 9వ తేదీ గంధం, 10వ తేదీ ఉరుసు, 11వ తేదీన ఊరేగింపు ఉంటాయన్నారు.

సైన్స్, గణితం పరికరాల విరాళం



పరికరాలతో ఉపాధ్యాయులు

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రగతి ప్రాజెక్టు సంస్థ గణితం, సైన్స్ పరికరాలను గురువారం విరాళంగా అందజేశారు. హెచ్‌ఎం భ్రమరాంబ మాట్లాడుతూ ఈ పరికరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగమని దాతలను అభినందించారు. ఉపాధ్యాయులు భారతి, ఆరాదన, పద్మజ, సత్యనారాయణ, రాజశేఖర్, పాల్గొన్నారు.

సమర్పిస్తేనే సంతకం

- రూ.వెయ్యి ఇస్తేనే పొజిషన్ సర్టిఫికెట్
- తుగ్గలి మండలంలో రెవెన్యూ అధికారుల దందా



తుగ్గలి తహసీల్దార్ కార్యాలయ పరిధిలో పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు కావాలంటే రూ.వెయ్యి ఇవ్వాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పథకం కింద ఇల్లు నిర్మించుకోవాలంటే ఈ సర్టిఫికెట్ తప్పనిసరి కావడంతో లబ్ధిదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

తుగ్గలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొత్తం 18 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. దాదాపు 50 వేలకు పైగా జనాభా ఉంది. ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద ఇల్లు నిర్మించుకోవాలంటే పొజిషన్ సర్టిఫికెట్ ఉండాలి. ఇది ఉంటేనే ప్రభుత్వ పథకం వర్తిసుంది. దీంతో లబ్ధిదారులు పొజిషన్ సర్టిఫికెట్ కోసం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. కాని మంజూరు చేయాలంటే రెవెన్యూ అధికారులకు ముట్టజెప్పాల్సిందేనని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క రూపాయి కూడా తీసుకోరాదు



వీఆర్వోలు పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరుకు ఒక్క రూపాయి కూడా అడగకూడదని ఆదేశాలిచ్చాం. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే నా దృష్టికి తీసుకురావాలి. - రమాదేవి, తహసీల్దార్

రూ. వెయ్యి ఇస్తేనే..

పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలంటే వీర్వోలు రూ.వెయ్యి డిమాండ్ చేస్తున్నట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసి తహసీల్దార్ కార్యాలయంలో అప్రూవల్ చేయాలంటే వీఆర్వోల చేతులు తడపాల్సి వస్తోందని ఆరోపణలు ఉన్నాయి. ఈ తతంగమంతా ఉన్నతాధికారుల సమక్షంలో సాగుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. లంచం ఇవ్వకుంటే సవాలక్ష ప్రశ్నలతో వేధిస్తున్నారని, డబ్బు ముట్టజెప్పితే వెంటనే వస్తోందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఈ దందాను ఆపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

15లోపు దరఖాస్తు చేసుకోవాలి

- పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి



ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశకాలకు నిర్వహించే పాలిసెట్-2025కు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. విరుపాపురం గ్రామ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఇస్తున్నామని, పరీక్ష 30వ తేదీన ఉంటుందన్నారు. 8121555646, 9059291616 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాల సంజీవనిని సవరించాలి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశపెట్టిన బాలసంజీవనిలో 2.0 వర్షన్‌లో సవరణ చేయాలని అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఐసీడీఎస్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కొత్త వర్షన్‌తో అంగన్‌వాడీలకు తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కాంతమ్మ, ఈరమ్మ, తిరుపతమ్మ, పద్మజ, రామాంజనమ్మ గోపాల్ పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోండి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ శిక్షణను వినియోగించుకోవాలని రూరల్ సీఐ పులిశేఖర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ కల్పన సూచించారు. గురువారం పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉచిత పాలిసెట్ శిక్షణను ప్రారంభించారు. పవన్ కళ్యాణ్, అశోక్, రాబర్ట్, రఘు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన ఉమాపతి నాయుడు


మంత్రి నిమ్మలను సన్మానిస్తున్న ఉమాపతి నాయుడు

ఆదోని, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడును గురువారం విజయవాడలో టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు కలిశారు. ఆదోని నియోజకవర్గ అభివృద్ధి, కార్యకర్తల ఇబ్బందులను మంత్రికి వివరించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆదోని అభివృద్ధి కుంటుపడిందని ఎలాగైనా నియోజకవర్గానికి మరిన్ని నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరినట్లు ఉమాపతి నాయుడు తెలిపారు. పార్టీ నాయకులు బాబు నాయుడు, రామకృష్ణ ఉన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందన


శ్రీనాథ్ గుప్తాను అభినందిస్తున్న సబ్ కలెక్టర్ భరద్వాజ్

ఆదోని, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అపోపా తరపున సేవలందించినందుకు బంగారు నంది అందుకున్న వంకదారు శ్రీనాథ్ గుప్తాను సబ్ కలెక్టర్ భరద్వాజ్ గురువారం కార్యాలయంలో అభినందించారు. తనకు సహకరించిన కాకుబాళ్ నగేష్ గురించి గుప్తా సబ్ కలెక్టర్‌కు వివరించారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు

మద్దికెర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మద్దమ్మకుంట గ్రామంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో గురువారం వైభవంగా పూజలు జరిగాయి. అర్చకుడు విజయప్రసాద్ యాదవ్, పురోహితుల ఆధ్వర్యంలో షష్టి వృత్తిక నక్షత్రం సందర్భంగా స్వామివారికి అభిషేకాలతో పాటు శాంతి హోమాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం


రోవర్ ద్వారా సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

ఆదోని రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే ద్వారా భూ సమస్యలజూజీ పరిష్కరిస్తామని తహసీల్దార్ శివరాముడు, రీ సర్వే ఛీటీటి పెద్దయ్య తెలిపారు. గురువారం మండలంలోని హనవాళ్ల గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామ సభ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేను సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. గ్రామంలో 3,915.11 ఎకరాల భూమి ఉందని, 16బ్లాక్‌లుగా విభజించి 48మంది అధికారులు 8 టీంలుగా సర్వే చేస్తారని తెలిపారు. మండల సర్వేయర్ ఈశ్వర్, వీఆర్వో దిలీప్, విలేజ్ సర్వేయర్ రాజు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలి

మద్దికెర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేయాలని మద్దికెర మోమిన్ వీది, జెండాకట్టకు చెందిన మహిళలు డిమాండ్ చేశారు. గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఐదు రోజులకోసారి కూడా నీరు వదలడం లేదని ఆరోపించారు. దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన కార్యదర్శి శివకుమార్ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి వెళ్లిపోయారు.


ధర్నా చేస్తున్న మహిళలు

పక్కా గృహాలు మంజూరు చేస్తాం

మద్దికెర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పేదలను గుర్తించి వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల కింద పక్కా గృహాలను గృహాలు మంజూరు చేస్తామని హౌసింగ్ ఈఈ వాసుదేవరావు తెలిపారు. గురువారం ఎం.అగ్రహారం గ్రామంలో హౌసింగ్ సిమెంట్ గోదాములను తనిఖీ చేశారు. వివరాలను సక్రమంగా ఉంచుకోవాలని ఆదేశించారు. గతంలో గృహాలు మంజూరై బిల్లులు రాని వారి వివరాలను కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు. హౌసింగ్ సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. డీఈ విజయమోహన్, ఏఈ ఉమాకాంత్ ఉన్నారు.


సిమెంటు నిల్వను పరిశీలిస్తున్న హౌసింగ్ ఈఈ

వైభవంగా రథోత్సవం


ఎద్దుల దొడ్డిలో సాగుతున్న వీరభద్రుడి రథోత్సవం

తుగ్గలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎద్దులదొడ్డిలో కాళికామాతా వీరభద్రేశ్వరస్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున కల్యాణం చేసిన అనంతరం వేద పండితులు యజ్ఞయాగాలు చేశారు. సాయంత్రం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సీఐ పులిశేఖర్, ఎస్ఐ కృష్ణమూర్తి బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ రాముల విజయ్, సింగిల్ విండో అధ్యక్షులు వైవీ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చక్రాళ్ల వీరేష్, టీడీపీ నాయకులు శ్రీనివాసులుగౌడు, హరి, రవికుమార్, మల్లన్న, ఉన్నారు.

వైభవంగా కలశ ప్రతిష్ఠ

దేవనకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలారుదిన్నె పెద్దమ్మ ఆలయంలో కలశ ప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. గ్రామంలో ప్రతిష్ఠ నేపథ్యంలో సందడి కనిపించింది. దాత విజయరాఘవేంద్ర రెడ్డి రూ.49 వేలతో ఆయానికి కలశాన్ని ప్రదానం చేశారు.

చెత్తను వేరు చేయండి

మద్దికెర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తడి పొడి చెత్తను వేరు చేయాలని ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి సూచించారు. గురువారం మద్దికెర, బొజ్జనాయునిపేట గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ఇళ్ల ముందు మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

అన్యాయంపై స్పందించరా?

ఆదోని టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీసీ మహిళ అయిన చైర్‌పర్సన్‌కు అన్యాయం జరిగితే స్పందించరా? అని బీజేపీ నాయకుడు, హుస్సేనప్ప యాదవ్ ప్రశ్నించారు. గురువారం ఆయన శాంత దీక్షకు సంఘీభావం తెలిపారు.

ఏఎన్‌ఎంకు గాయాలు

ఆదోని రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): విధులకు స్కూటర్ అదుపు తప్పడంతో ఏఎన్‌ఎం సోమావతి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల మేరకు.. మండలంలోని మదిరె గ్రామంలో ఎఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం విధులకు వెళ్తుండగా, శిరుగుప్ప క్రాస్ వద్ద కుక్కలు అడ్డు రావడంతో స్కూటర్ అదుపు తప్పింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆదోని ఏరియా ఆసుపత్రికి తర లించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఇస్పీ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

- తహసీల్దార్ రమేష్
- పట్టణంలో అక్రమణలను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది


నిర్మాణాలు చేస్తున్న ప్రభుత్వ స్థలం

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రమేష్ హెచ్చరించారు. గురువారం కర్నూలు రోడ్డులోని సుస్వాగతం బోర్డు వద్ద ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను రెవన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. తమకు పట్టాలు ఉన్నాయని, అందుకే నిర్మాణాలు చేస్తున్నట్లు పనులు చేస్తున్నామని సంబంధిత వ్యక్తులు తహసీల్దార్‌కు వివరించారు. అయితే ఈ స్థలాల్లో ఎవరికీ పట్టాలు ఇవ్వలేదని తహసీల్దార్ అన్నారు. దీంతో నిర్మాణదారులకు, తహసీల్దార్‌కు వాగ్వాదం చోటు చేసుకుంది. నిర్మాణదారులు శ్రీనివాసులు, థామస్, రాముడు తహసీల్దార్ కారుకు అడ్డంగా కూర్చుని నిరసన తెలిపారు. పోలీసులు చేరుకుని పంపించేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ సదరు భూమి హిందూ శ్మశాన వాటిక, పొలాల రస్తా అన్నారు.

పలు చోట్ల వర్షం


మాచాపురం వద్ద కురుస్తున్న వర్షం

దేవనకొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. కప్పట్రాళ్ల, ఈదుల దేవర బండ, మాచాపురం గ్రామాల్లో వర్షంతో పాటు ఈదురుగాలులు వీచాయి. దీంతో తోటల్లో మామిడి కాయలు రాలిపోయా యని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై కొవ్వొత్తుల ర్యాలీ


ఆదోనిలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దైవ సేవకుడు పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ఆదోని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. రెండవ పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలోని భీమాస్ హాల్ వద్ద నుంచి మున్సిపల్ మెయిన్ రోడ్డు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. క్రైస్తవులు భారీగా తరలి వచ్చి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు డేనియల్ ప్రేమ్ కుమార్, ఎమ్మెస్ రావు, ఆనంద్ రాజు, ఎజ్రా శ్రీధర్, బెనర్జీ మాట్లా డుతూ దైవ వర్తమానికుడు, క్రైస్తవ గొంతుక పగడాల ప్రవీణ్ మృతి క్రైస్తవులను దుఃఖంలోకి నెట్టిందన్నారు. ఆయన మృతి పై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేసి క్రైస్తవ సమాజానికి నిజాలు తెలియజేయాలని కోరారు.

మూతపడ్డ ఏబీసీ ఈఈ కార్యాలయం


ఆలూరులో ముతపడ్డ కార్యాలయం

ఆలూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆలూరు బ్రాంచ్ కెనాల్ (ఏబీసీ) సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఎప్పుడు చూసినా మూసే ఉంటుంది. డీఈఈతో పాటు, ఇద్దరు జేఈలు ఒక జూనియర్ అసిస్టెంట్, లస్కర్‌హ విధులు నిర్వహిస్తున్నారు. ఏబీసీ కాల్వ కింద 30వేల ఎకరాల అయకట్టు, 19 డీస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. అధికారులు గుంతకల్లు నుంచే విధులు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. తమ సాగునీటి సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని, ప్రభుత్వం స్పందించి, తెరిపించాలని రైతులు కోరుతున్నారు.

కలుషిత నీరు తాగితే వ్యాధులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- హాలహర్వి ప్రభుత్వ వైద్యాధికారి వలి



హాలహర్వి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో కలుషిత నీరు తాగితే వ్యాధుల భారిన పడే ప్రమాదం ఉందని హాలహర్వి వైద్య అధికారి మన్సూర్ వలి అన్నారు.

ప్రశ్న: వేసవిలో వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: వేసవిలో చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి. వృద్దులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలి. అనారోగ్యం వస్తే వైద్యులను సంప్రదించాలి.

ప్రశ్న: పెరుగుతున్న ఉష్ణోగ్రతలు చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యం పట్ల ఎలాంటి ప్రభావం చూపుతుంది?

జవాబు: చిన్నారులకు శరీరంలో ఉష్ణోగ్రత సమతుల్యంగా ఉంచేందుకు అధిక మోతాదులో తల్లిపాలు ఇవ్వాలి. పిల్లలకు శరీర ఉష్ణోగ్రత పెరిగితే జాండీస్ సోకే ప్రమాదం ఉంది. వీటితోపాటు విషజ్వరాలు, వాంతులు విరోచనాలు వ్యాపిస్తాయి. వృద్ధులు సైతం ఇబ్బందులు పడే ప్రమాదం ఉంటుంది.

ప్రశ్న: వేసవిలో ఎండను తట్టుకోవడానికి శీతల పానీయాలు తీసుకోవచ్చా?

జవాబు: వేసవిలో శీతల పానీయాలు, జ్యూస్‌లు తీసుకోవడం మంచిది కాదు. వాటిని తీసుకోవడం వల్ల రక్తంలో ఫాస్ఫరస్ చేరి ఎముకలు, దంతాలు, మూత్రపిండాల వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వాటికి బదులుగా మజ్జిగ, కొబ్బరి నీళ్లు, బార్లీ నీళ్లు, నిమ్మరసం తీసుకోవడం ఉత్తమం.

ప్రశ్న: వేసవిలో ఏవిధమైన ఆహారాన్ని తీసుకోవాలి?

జవాబు: శరీర ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచుకునేందుకు ఆహార అలవాట్లు మార్చుకోవాలి. పాలకూర, ముల్లంగి, బీట్‌రూట్, వెల్లుల్లి, ఉల్లి, తీసుకోవాలి. వీటితోపాటు పండ్లు కూడా తినడం ఉత్తమం.

ప్రశ్న: డీ హైడ్రేషన్‌కు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: వేసవిలో వచ్చే ప్రధాన సమస్య డీహైడ్రేషన్. ఎక్కువ నీరు తాగాలి. మజ్జిగ కూడా అధికంగా తీసుకోవాలి. కొబ్బరి నీళ్లు ఎనర్జీ ఇస్తుంది. కీర దోసకాయ, పండ్ల రసాలు ఉత్తమం.

ప్రశ్న: బయటకు వెళ్లే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయట తిరగరాదు. అత్యవసరమైతే హెల్మెట్, తలకు తడిగుడ్డ చుట్టుకొని వెళ్లాలి. నీరు, ఓఆర్‌స ప్యాకెట్లు దగ్గర పెట్టుకోవాలి. వడదెబ్బకు గురైతే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకోవాలి.

ప్రశ్న: ఉపాధి కూలీలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: కూలీలు పనిచేసే చోట తాగునీరు, మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి. అప్పుడప్పుడూ టెంట్ల కింద సేదతీరాలి.

ఇనాం భూములు కబ్జా



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంత్రాలయం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చిలకలడోన గ్రామంలో సర్వేనెం.62లో ఆంజనేయస్వామి, లక్ష్మమ్మ అమ్మవార్లకు కేటాయించిన ఇనామ్ భూములు కబ్జాకు గురవుతున్నాయని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నేపాల్ అన్నారు. గురువారం తహసీల్దార్ ఎస్. రవిని కలిసి దేవుని మాన్యం భూములు కాపాడాలని వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ఒక వ్యక్తి తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను సృష్టించి దేవుని మాన్యం భూములు కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇందుకు గ్రామ అధికారులు, మండల స్థాయి అధికారులు సైతం ముడుపులు తీసుకుని ఆ సదురు వ్యక్తికి ఇస్తున్నారని ఆరోపించారు. కబ్జాకు గురవుతున్న దేవుని మాన్యంపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించండి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘం సభ్యులకు 2015 ఇచ్చిన స్థలాలను సభ్యులపేరుపై రిజిస్ట్రేషన్ చేయించి, ఆస్థలాల్లో ఇళ్లనిర్మించి ఇవ్వాలని వైడబ్ల్యూసీఎస్ చేనేతకార్మికుల హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు రామచంద్ర, నాగరాజు, శ్రీధర్, హనుమంతులు కోరారు. వైడబ్ల్యూసీఎస్‌కు వచ్చిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని సంఘం ఆధ్వర్యంలో నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ సభ్యులకు స్థలాలు ఇచ్చి దాదాపు పదేళ్ల గడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయకుండా జ్యాప్యం చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనల పేరుతో సొసైటీ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కనీసం మీరైన పట్టించుకొని స్థలాల్లో ఇళ్లనిర్మించి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే సొసైటీ సభ్యులుగా ఉంటూ మృతి చెందిన సభ్యుల పిల్లలకు ఏ క్లాస్ సభ్యత్వం ఇచ్చి వారికి మగ్గాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ పరిశీలించి త్వరలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మిగనూరు డిపో ముందు రెండో రోజు ఎర్ర బ్యాడ్జీ ధరించి విధులలో పాల్గొని నిరసన కార్యక్రమం చేపట్టారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.ఎండి రఫీ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని,ఆర్టీసి ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కార్డు బదులు పాత పద్ధతిలో సీలింగ్ లేని వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. ఎస్ఆర్బీఎస్ సంక్షేమ పథకం ఆమలు చేయాలని,సిబ్బందికి పనిష్మెంట్స్‌కు ఏసీఎల్-హైకోర్టు పిటిషన్‌కు ఆవకాశం కల్పించాలని, సర్క్యులర్‌ను ఇంప్లిమెంట్ చేయాలని, గ్యారేజీలో నెలకొన్న సమస్యలు,మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ముస్తాక్ అహ్మద్, శేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నందవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నందవరం మండలం మాచాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నాగరాజు తమ అనచరులతో గురువారం ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సుధాకర్‌రెడ్డి, నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకోసం, రాష్ట్రభివృద్ధి కోసం చేస్తున్న పనులను చూసి ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. మండలంలో టీడీపీ బలోపేతంకు కృషి చేస్తామని వారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్ కాశీం వలి, టీడీపీ నాయకులు పీర్‌సాబ్, వలి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షరాస్యతపై దృష్టి సారించండి: ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో అక్షరాస్యతలో వెనుకబడిన కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు మంత్రాలయం మండలాలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. గురువారం రాంపురంలో డీఈవో శామ్యూల్‌పాల్, నాలుగు మండలాల ఎంఈవోలతో కలిసి విద్యావ్యవస్థ ప్రక్షాళనపై ఎమ్మెల్యే చర్చించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా సర్దుబాటు చేసి విద్యా బోధనకు కుంటుపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనేక మంది విద్యార్థులు వలసబాట పట్టారని, అలాంటి వారిని గుర్తించి అలాంటి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి బడుల్లో చేరే విధంగా చూడాలన్నారు. గదుల కొరతపై తమ దృష్టికి తెస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పదో తరగతిలో అధిక శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కష్టపడ్డారని, వారు ఆశించిన ఫలితాలు రావాలని సూచించారు. క్లస్టర్ రీఆర్గనైజేషన్ పై మాట్లాడారు. ఈ సమీక్షలో వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి, వెంకట్రామిరెడ్డి మంత్రాలయం, కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు ఎంఈవోలు రాగన్న, రామాంజనేయులు, శోభారాణి, సువర్ణ సునీయమ్, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు?

● సచివాలయం, ఆర్‌బీకే,
హెల్త్ సెంటర్లకు ఐదేళ్ల నిరీక్షణ
● బేస్‌మట్టానికే పరిమితమైన భవనాలు

మంత్రాలయం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రారంభించిన సచివాలయాలు,ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ల భవనాలు పూనాదులకే పరిమితమయ్యాయి. ఐదేళ్ల నుంచి భవనాలు పూర్తి కావడం లేదు. నిధులు ఉన్నా ఎందుకు నిర్మాణాలు చేపట్టడం లేదో అర్థం కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని సూగూరులో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.17.50 లక్షలతో హెల్త్ సెంటరు, రూ.21.80 లక్షలతో ఆర్‌బీకే కేంద్రం, బెస్‌మట్టం లెవెల్‌లోనే ఉన్నాయి. ప్రసుత్తం ఇవి ముళ్ల పొదల్లో మునిగిపోయాయి. అలాగే సుంకేశ్వరి గ్రామంలో హెల్త్ సెంటర్, ఆర్‌బీకే, వగరూరులో ఆర్‌బీకే, చిలకలడోనలో ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లు, ఖగ్గల్లు, కాచాపురంలలో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లు పునాదులకే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వమైన స్పందించి భవనాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చిలకలడోనలో బేస్ మట్టానికే పరిమితమైన హెల్త్ సెంటర్



సూగూరులో మొక్కలు మొలచిన ఆర్‌బీకే కేంద్రం

ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తే పనులు చేపడుతాం



ఉన్నతాధికారుల నుంచి ఈ భవనాలను పూర్తి చేయాలని ఆదేశిస్తే పనులు వెంటనే ప్రారంభిస్తామని, వీటికి నిధుల కొరత లేదన్నారు. ఎన్నికల రావడంతో గత ప్రభుత్వం అర్ధాంతరంగా పనులు మధ్యలోనే నిలిపివేసింది. కొత్త ప్రభుత్వం టాప్ వేసిన భవనాలను మాత్రమే పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో గతంలో పెండింగ్‌లో ఉన్న భవనాలను ప్రారంభానికి సిద్ధంగా చేశామన్నారు.

- మల్లయ్య, ఏఈఈ పంచాయతీరాజ్, మంత్రాలయం

చేనేతలు అభివృద్ధి చెందాలి: ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో చేనేతలు ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకొని వాటిని ఉపయోగించుకుని అభివృద్ధిలోకి రావాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని టీబీపీ కాలనీలో ఎమ్మెల్యే స్వగృహం దగ్గర చేనేత వస్త్రాల కొత్త డిజైన్లపై చేనేత మహిళలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి చేనేత జౌళిశాఖకు చెందిన ప్రముఖ డిజైనర్ రామ్ చంద్రిక హాజరయ్యారు. ఆమె ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త కొత్త డిజైన్లపై చేనేతలు అవగాహన పెంచుకోవాలన్నారు. నూతన డిజైన్లపై ప్రభుత్వం ఇచ్చే శిక్షణలను వినియోగించుకొని వాటి ఆధారంగా ఎమ్మిగనూరులోనే నూతన డిజైన్ల వస్త్రాలను తయారు చేసి మార్కెటింగ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ చేనేత కార్మికుల నైపుణ్యం పెంచుకునేందుకు అవకాశాలను కల్పిస్తామన్నారు. చేనేతలు చేనేత కార్మికులుగా మాత్రమే కాకుండా ప్రతిభ కనబరచి చేనేతకళాకారులుగా గుర్తింపు పొందాలన్నారు. అలాగే ఎమ్మెల్యే సతీమణి నిత్యాదేవి మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ, డిజైనర్ రామ్ చంద్రికలు స్థానిక చేనేతజౌళి శాఖ అధికారులతో కలిసి పట్టణంలోని చేనేత వార్డుల్లో గుంత మగ్గాలను, రేషన్ మగ్గాలను పరిశీలించారు. అలాగే వైడబ్ల్యూసీఎస్‌ను సందర్శించారు. సొసైటీ సభ్యులు తమ ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టారు. ప్రధానంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు, యారన్ సబ్సీడీ, సభ్యుల పిల్లలకు ఏక్లాస్ మెంబర్ షిప్ ఇచ్చి కొత్తగా రేషన్ మగ్గాలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తు సభ్యుల సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాగరాజరావు, నాయకులు మిన్నప్ప, నరసప్ప, బుగుడే నాగరాజు, రాజు, మహేష్, మల్లయ్య, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



వర్షానికి తడిసిన ఉల్లిని ఆరబెట్టుకుంటున్న దృశ్యం

అకాల వర్షం..ఆపార నష్టం

● వంద ఎకరాలలో ఉల్లి,
50 ఎకరాలలో మినుము పంటకు నష్టం



గోనెగండ్లలో గద్వాల వీధిలో పారుతున్న వర్షపునీరు

గోనెగండ్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో గురువారం కురిసిన అకాల వర్షం వల్ల ఉల్లి, మినుము పంటల రైతులకు నష్టం కలిగించింది. పంట కోసుకొని పొలంలో ఆరబెట్టుకున్న పంట వర్షంకు తడిసి ముద్దయిపోయింది. దీంతో ఉల్లి, మినుము పంటలను సాగు చేసిన రైతులు లబోదిబోమంటున్నారు. గోనెగండ్ల, గాజులదిన్నె, కులుమాల, హెచ్ కైరవాడి గ్రామాలతో పాటు పలు గ్రామాలలో అకాల వర్షానికి వంద ఎకరాలలోఉల్లి పంట, 50 ఎకరాలలో మినుము పంట నష్టం జరిగింది.

గోనెగండ్లలో వర్షం: గోనెగండ్లలతో పాటు గాజులదిన్నె, హెచ్ కైరవాడి, అలువాల, కులుమాల గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వీధులు జలమయమయ్యాయి. గోనెగండ్ల పలు వీధులలో వర్షం నీరు పారడంతో జనానికి ఎండ వేడిమి నుంచి కొంత ఉపశమనం కలిగింది. మండు వేసవిలో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షం జనానికి కొంత ఊరటనిచ్చింది.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గోనెగండ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. గురువారం గోనెగండ్లలోని పలు వీధుల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కాలువలో నిండిన చెత్తను, ముళ్ల పొదలను ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్లతో తొలగించారు. సతీష్ మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టాలని అందుకు గ్రామాల ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్‌బాషా, అనిల్, సుబాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేలో అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి



రైతులకు నోటీసు అందజేస్తున్న సబ్ కలెక్టర్

కౌతాళం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో రెవెన్యూ అధికారులు చేపట్టిన రీసర్వేలో ఏమైన అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభర్వదాజ్ తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గుడికంబాలి గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే పనులను గురువారం పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామంలో రీసర్వే పనులు చేపట్టామని రీసర్వేలో రైతులకు తప్పులు జరిగాయని అనిపిస్తే అలాంటి వారు రీసర్వే అధికారులకు సరైన పత్రాలతో సమర్పించాలన్నారు. రైతులు తహసీల్దార్‌కు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సర్వే పూర్తి అయిన రైతులకు 9(2) కింద నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి, డివిజినల్ సర్వేయర్ వేణు సూర్య, మండల సర్వేయర్ బసవరాజు స్వామి గ్రామ సర్పంచ్ సిద్వేశ గ్రామ వీఆర్వోలు నాగార్జున రెడ్డి, నరసింహులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పొలాలకు దారి చూపాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, రైతులు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని పార్లపల్లి గ్రామంలోని దళిత రైతుల భూములకు హద్దులు, దారిని చూపించాలని ప్రజా సంఘాల నాయకులు రామతీర్థం అమరేష్, సుమాలా చార్లెస్, ప్రసన్నకుమార్ కోరారు. గురువారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ వారు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ రైతులకు దారి చూపకుండ గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకున్న భూములకు దారి చూపడం ఏమిటన్నారు. తక్షణమే తహసీల్దార్ స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మునెప్ప, మల్లేష్, దినకర్, గిడ్డన్న, దేవదానం, జయరాజు, బాబు, షడ్రక్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

మంత్రాలయం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సమీపంలో హెలిప్యాడ్ మైదానం వద్ద రాఘవేంద్రపురానికి చెందిన వడ్డె రాగమ్మ అనే మహిళ మద్యం తరలిస్తుండగా.. పట్టుకున్నట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు. గ్రామంలో కర్ణాటక మద్యం అమ్ముతున్నారని, కర్ణాటక నుంచి అక్రమంగా 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు 60ని స్వాధీనం చేసుకుని మహిళను అరెస్టు చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. కర్ణాటక మద్యం రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. చైత్రమాస షష్టి, రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవలో భాగంగా ఉత్సవ మూర్తిని ఊయలలో ఉంచి ఊరేగించారు. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. గురువారం రాఘవేంద్రస్వామికి ఇష్టమైన దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహరాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంచాలమ్మ, రాఘవరాయడికి విశేష పంచామృతాభిషేకం: రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ, రాఘవరాయడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. గురువారం చైత్ర షష్ఠి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి,రాఘవరాయుడి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా రాఘవేంద్రస్వామికి బంగారు కవచ సమర్పణ సేవతోపాటు వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు.



స్వర్ణ రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



మున్సిపల్ శాఖ మంత్రికి పంపే లేఖలను చూపిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఆప్కాస్‌ను కొనసాగించాలని సీఐటీయూ మునిసిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం మాస్టర్ సమయంలో సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఇస్మాయిల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎలక్షన్స్ సమయంలో అధికారంలోకి కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిన కార్మికుల గురించి పట్టించుకోవడంలేదని అన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఆప్కాస్‌ను కొనసాగించాలని గ్రాట్యుటీ, పెన్షన్ ఇవ్వాలని మున్సిపల్ శాఖ మంత్రికి మాస్టర్ సమయంలో కార్మికులు సామూహికంగా లేఖలు రాసి పంపించారు. కార్యక్రమంలో మునీంద్ర, ఖాజా, బాషా పాల్గొన్నారు.

నందవరం ఎస్ఐగా కేశవ్



నందవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నందవరం మండల నూతన ఎస్ఐ కేశవ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న శ్రీనివాసులు కర్నూలు వీఆర్‌కు బదిలీ అయ్యారు. నూతన బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ నంద్యాల జిల్లా కొత్తపల్లినుంచి నందవరానికి బదిలీ పై వచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మండల ప్రజలకు అన్నివేళల అందులో బాటులో ఉంటానని తెలిపారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

రూ.10 లక్షల అభివృద్ధి పనులకు భూమి పూజ



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

గోనెగండ్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాభివృద్ధి సాధ్యం అని మండల టీడీపీ నాయకులు బేతాలబడేసా, తిరుపతయ్య నాయుడు, మాజీ సర్పంచ్ ఎర్రబాడు శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎర్రబాడు గ్రామంలో రూ. 10లక్షలతో శివాలయం నుంచి ముళ్ల ఖాజా హుస్సేన్ ఇంటి వరకు సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని ఇప్పటికి మూడు కోట్లు రూపాయలతో మండలంలో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రంగముని, ఫకృద్దీన్, షేక్షావలి, మౌలా, కటిక షేక్షావలి, తిరుమలేష్, రామచంద్రగౌడ్, ఏసు, కుమార్, నాగేష్ పాల్గొన్నారు.

సర్వేతోనే భూ సమస్యలు పరిష్కారం

నందవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సర్వేలతోనే భూసమస్యలు పరిష్కారం అవుతాయని నందవరం తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని నదికైరవాడి గ్రామంలో ఆయన పర్యటించారు. రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సర్వే చేసే సమయంలో ఒకరికి తక్కువ భూమి మరొకరికి ఎక్కువ భూమి వచ్చిందని రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, అన్నింటిని సరిచేస్తామని ఆయన అన్నారు. గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ప్రజల నుంచి సమస్యల దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్లు మహేష్, అక్బర్‌బాషా, శేఖర్, ఆర్ఐ సుబ్బారెడ్డి నాయకులు వీరేష్, బజారి, వీరారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు